# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక వార్త




## వాహనాలు తనిఖీల్లో భారీ నగదు పట్టివేత



సమావేశంలో మాట్లాడుతున్న సిఐ వేణుగోపాల్ రెడ్డి

చిల్లకూరు, మార్చి 10, ప్రభాతవార్త

మండల పరిధిలోని భోజనం టోల్ ప్లాజా వద్ద శనివారం రాత్రి జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు గత కొద్ది రోజుల్లో జరుగు ఎన్నికల్లో భాగంగా ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా ఎస్ఐ అంజిరెడ్డి సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా శ్రీకాకుళం జిల్లాకు చెందిన తోట మణికంఠ జి. మన్మధ రావులు కారులో ఎలాంటి బిల్లులు లేకుండా 64 లక్షల నగదు 14 సవర్ల బంగారు ఆభరణాలు తీసుకొని వెళ్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. ఆదివారం చిల్లకూరు పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి సిఐ వేణుగోపాల్ రెడ్డి వివరాలు వెల్లడించారు. అనంతరం ఈ నగదును ఐటీ డిపార్ట్మెంట్‌కి చేరడం జరుగుతుందన్నారు. ఎన్నికల కోడ్ రాకముందే గూడూరు డిఎస్పి సూర్య నారాయణరెడ్డిని సూచనలు మేరకు వాహనాలు తనిఖీలు చేపట్టడం గమనార్హం.

## త్రిశూల స్నానంతో కపిలేశ్వరుని బ్రహ్మోత్సవాలు ముగింపు



తిరుపతి, మార్చి 10ప్రభాతవార్త:

కపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఉదయం త్రిశూల స్నానంతో ముగిశాయి. వేదోక్తంగా, శాస్త్రోక్తంగాపవిత్ర పుష్కరిణిలో సుగందపరిమళ ద్రవ్యాలతో ఆలయ అర్చకులు త్రిశూల స్నానం చేయించారు. రాత్రి ధ్వజావరోహణం, రావాణాసుర వాహనంతో పరిసమాప్తమయ్యాయి. భక్తులు హరహరమహాదేవ ,నమ:శ్శివాయ అంటూ పవిత్ర స్నానాలు ఆచరించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఇఓ దేవేంద్రబాబు, ఎఈఓ సుబ్బరాజు, ఆలయ సూపరింటెండెంట్ భూపతి, ఆలయ అర్చకులు,ఆలయ ఇన్‌స్పెక్టర్‌లు రవికుమార్, బాలకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

# భోళాశంకరుని కళ్యాణానికి దక్షిణ కైలాసం ముస్తాబు

### -అంబారిపై వరుడుగా ఆదిదేవుడు..సింహంపై వధువుగా అమ్మవారు -శ్రీకాళహస్తిలో పెళ్లికళ



-సింహవాహనంపై అమ్మవారు, గజవాహనంపై స్వామివారు గ్రామోత్సవం



చెట్టుపై విహరిస్తున్న శివపార్వతులు సెట్టింగ్

శ్రీకాళహస్తి, మార్చి 10 ప్రభాతవార్త

ముల్లోకాల్ని ఏలే ముక్కంటీశుని కళ్యాణోత్సవం కన్నుల పండువగా అంగరంగ వైభవంగా ఆదివారం రాత్రి ప్రారంభమైంది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో స్వామి అమ్మవార్ల కళ్యాణ వేడుకలు ప్రారంభమయ్యాయి. వేకువ జామున జరిగే వివాహానికి స్వామి అమ్మవార్లు ముస్తాబై ఆలయం నుంచి బయలు దేరారు..ముక్కోటి దేవతలు సాక్షిగా పంచభూతాల ఆశీర్వచనాలతో ఆదిదేవుడు,పార్వతీ దేవిల కళ్యాణం కమనీయంగా ప్రారంభమైంది.. స్వామి అమ్మవార్ల కళ్యాణంతో పాటు వివాహాలు జరుపుకునే కొత్త దంపతులకు ప్రత్యేకంగా దేవస్థానం ఏర్పాట్లు చేపట్టారు. హిందూ వివాహ వ్యవస్థను భావి తరాలకు తెలియజేసే విధంగా ఏర్పాట్లు జరిగాయి. శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి,ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు శ్రీనివాసులు, ఈఓ నాగేశ్వరరావు సారధ్యంలో సమయపాలనతో కార్యక్రమాలు రూపొందించారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత ప్రారంభమైన స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవ శోభామానంగా సాగింది.

### కళ్యాణం కమనీయం . . .

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వేకువ జాము 4గంటలకు నిర్వహించే స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవానికి సర్వం సిద్ధంచేశారు. ఆది దంపతుల్ని వధూవరులుగా ముస్తాబుచేశారు. రాత్రి ఆలయంలోని అలంకార మండపంలో శ్రీకాళహస్తీశ్వరుని వరునిగా, దేవేరి జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని వధువుగా ముస్తాబుచేసి ఆలయంలోని నాలుగువైపులా ఉత్సవం నిర్వహించారు. యాగశాల వద్ద కవ్వం తీసి ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాధన్ చుక్కలు పెట్టి ఊరేగింపుకు పంపారు. కళ్యాణోత్సవం సందర్భంగా నాలుగుమాడావీధులు, సన్నిధివీధిలోని విద్యుత్ స్తంభాలకు మామిడితోరణాలు, అరటి చెట్లతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.నెహ్రూవీధిలో బారికాడ్లతో కాలుమోపలేని వాతావరణం చోటు చేసుకుంది.

### అంబారిపై వరుడు: సింహంపై వధువు

అంబారిపైస్వామి, సింహవాహనంపై అమ్మవారు నాటి రాజులు అందించిన ఏడు వారాల నగల్లో చూడటానికి వేయికళ్ళు చాలవన్నట్లు ముస్తాబు చేశారు.ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ కార్యనిర్వహణాధికారి సాగర్‌బాబు సూచనలతో హారతులిచ్చి వధూవరుల్ని సాగనంపారు. కళ్యాణోత్సవానికి కదలిన ఆదిదంపతులకు ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షించారు. ఆలయానికి సంబందించి జెండా వెళుతుండగా వెనుక గొడుగులు, ఆతర్వాత నంది, సాంస్కృతిక బృందాల, కోలాటాలు, కీలు గుర్రాలు,విచిత్ర వేష ధారణలు,చెక్కభజనలు,కులుకు భజనలు బుట్టబొమ్మలు అనుసరించాయి. కేరళ వాయిద్యాల శబ్దాలు భక్తుల్ని గగుర్పాటు కల్గించాయి.ఎలుకవాహనంపై వినాయకుడు, నెమలివాహనంపై సుబ్రమణ్యస్వామి, ముందు వెనుక చండికేశ్వరుడు, భక్తకన్నప్ప వెంటరాగా శివపార్వతులు కళ్యాణోత్సవానికి బయలుదేరారు.

### బాల్యవివాహాల కట్టడికి ప్రణాళిక - కనువిందుగా పెళ్లిజంటలు..

శ్రీకాళహస్తి ఆదివారం రాత్రి పెళ్లిపందిరిగా మారింది. బాల్య వివాహాలకు సంబంధించి వివిధ శాఖల అధికారులు చర్యలు తీసుకోగా ఈ ఏడాది చుట్టుపక్కల గ్రామాల నుంచి పెళ్ళి జంటలు కనువిందు చేసాయి. సాయంత్రం నుంచి వేకువజామునపట్టన నడిబొడ్డులోని పెండ్లిమండపం వద్ద కైలాసనాధునికి అడవిరాజుపుత్రిక పార్వతీదేవికి అంగరంగవైభవంగా కళ్యాణోత్సవానికి ఏర్పాట్లుచేశారు. ఈ ఉత్సవాన్ని తిలకిచేందుకు వేలాది మంది భక్తులు కదలి వచ్చారు. ఈఏడాది శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనప్పటి నుంచి ఇఓ వి.యస్‌నాగేశ్వరరావు సమయపాలన గురించి కట్టడి చేయటంతో సిబ్బంది



ముస్తాబైన పెండ్లిమండపం

కూడా పాటించారు.దాంతో ధార్మిక కార్యక్రమాల్లో ప్రజలు కూడా భాగస్వాములై తిలకించారు.

### శ్రీకాళహస్తిలో పెళ్లికళ..

స్వామిఅమ్మవార్ల కళ్యాణోత్సవానికి దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేసింది. పట్టణంలోని నాలుగుమాడావీధులను శుభ్రంచేసి రోడ్డుపై నీళ్లుచల్లారు. పెండ్లిమండపం సమీపంలోని నగరివీధిలో మామిడితోరణాలు,సంప్రదాయ బద్ధంగా ముగ్గులు, అరటిచెట్లతో ముస్తాబుచేశారు. దీంతో శ్రీకాళహస్తికి పెళ్లికళ వచ్చేసింది. పట్టణంలోని పలుమార్గాలను బాల్యవివాహాల కట్టడికి పోలీసులు ప్రణాళిక సత్ఫలితాలనిచ్చింది,పట్టణంలోని పానగల్‌లోని పొన్నాలమ్మగుడి నుంచి ఆలయానికి వచ్చేవాహనాలను అటువైపుగా మళ్లించారు. ఆర్‌టిసి బస్సులను పంచాయితీరాజ్ అతిధిగృహం వద్ద ఆపివేశారు. ఇక సన్నిధివీధిలోని రాఘవేంద్రస్వామిమఠం వద్ద రోడ్డుకు అడ్డంగా తోపుబోర్డులు ఏర్పాటుచేసి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. అలాగే సమాచార కేంద్రం వద్ద పోలీసుల నిఘా ఏర్పాటుచేశారు.

# ప్రజల్ని దగాచేసి అధికారంలో రావాలని చంద్రబాబు తపన

### మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



కుప్పంలో బహిరంగసభలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కుప్పం, మార్చి 10 ప్రభాతవార్త

ప్రజల్ని మరోమారు దగా చేసి అధికారంలో రావాలని ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు తపన పడుతున్నారని రాష్ట్ర అటవీ,గనుల శాఖమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం కుప్పంలో రూ 5కోట్లతో నూతనంగా నిర్మించిన మున్సిపల్ కార్యాలయ భవనంను మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ అధ్వర్యంలో ఏర్పాటుచేసిన సభలో మంత్రి ప్రసంగించారు. 2014 ఎన్నికల సమయంలో 600కుపైగా హామీలిచ్చి అధికారంలో వచ్చాక ప్రజల్ని మోసగించిన చంద్రబాబు ఆఖరుకు మహిళల రుణాలు 14200కోట్లు ఉండగా వాటిని కూడా మాఫీ చేయని చంద్రబాబు మరలా సూపర్ సిక్స్ పథకాలంటూ చెబుతున్నారని వీటికి అయ్యే రూ 2.50లక్షల కోట్లు నిజంగానే ఇస్తారా అని ప్రశ్నించారు. కులమతాలు,రాజకీయాలు చూడకుండా సిఎం జగన్ పథకాలు అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 32.50లక్షల ఇళ్ల పట్టాలు అందించామన్నారు. 16లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని గతంలో ఎప్పుడైనా ఇలా జరిగిందా అని ప్రశ్నించారు. పేదల కోసం పనిచేసే వ్యక్తి సిఎం జగన్ అన్నారు. చంద్రబాబునాయుడు ఓట్ల కోసం ప్రజలకు తాయిలాలు ఆశచూపుతారని విమర్శించారు. చంద్రబాబుకు ప్రజలు ఓట్లేస్తే అభివృద్ధి వెనక్కు వెళ్తుందన్నారు. కుప్పంను మున్సిపాలిటీగా చేశామని, రెవెన్యూ,సబ్ డివిజన్‌లు ఏర్పాటుచేశామన్నారు. కుప్పం ప్రజలు, రైతులకోసం తాగు,సాగునీరు అందించాలని హంద్రీ-నీవా జలాలు తెచ్చామన్నారు. ఈసారి వర్షాలు కురిస్తే కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో 110 చెరువులు పూర్తిగా నిండుతాయన్నారు. అయితే కుప్పానికి నీళ్ల రాలేదని ఓపత్రిక (వార్తకాదు) తప్పుడు కథనాలు ప్రచురించడం దారుణమన్నారు.కుప్పం మున్సిపాలిటీలోనే 60కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఎంపి రెడ్డెప్ప మాట్లాడుతూ కుప్పంలో ఈసారి మార్పు తేవాలని కోరారు. వైకాపా పాలనలో లంచాలు లేకుండా పథకాలు అందించామన్నారు. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ కుప ్పంలో తాము అభివృద్ధి చేయలేదని చెప్పడం తగదన్నారు. 35 ఏళ్లుగా చంద్రబాబు ఇక్కడ ఉన్నా హంద్రీ-నీవా పనులు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. అభివృద్ధి జరగలేదనేవారికి కళ్ల కన్పించవా అని ప్రశ్నించారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నూతనంగా నిర్మించిన రాజన ్న క్యాంటీన్, సింగిల్‌విండో భవనం, 16లక్షలతో కుప్పం చెరువు వద్ద చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో చిత్తూరు ఎంపి రెడ్డెప్ప, జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యే వెంకటేగౌడ, రెస్కోఛైర్మన్ సెంధిల్‌కుమార్, ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, మాజీ టిటిడి బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, పరిశీలకుడు రెడ్డెప్ప, పికెఎం ఉడా ఛైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, కార్పోరేషన్ ఛైర్మన్ వనిత శ్రీను, స్థానిక నేతలు పాల్గొన్నారు.

### ప్రశాంత వాతావరణంలో

# ఎన్నికలు నిర్వహణకు చర్యలు

### - చిత్తూరులో కేంద్ర బలగాల కవాతు



చిత్తూరు, మార్చి 10 ప్రభాతవార్త: 2024 సార్వత్రిక ఎన్నికలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించి పూర్తి చేయడానికి ఎలక్షన్ కమీషన్ సర్వం సిద్ధం చేస్తోంది. చిత్తూరు జిల్లాలో సార్వత్రి ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించి పూర్తి చేయడానికి కేంద్ర బలగాలు వచ్చాయి. కేంద్ర బలగాలను పోలీసు శాఖ జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి ఉపయోగించుకోనుంది. జిల్లాకు వచ్చిన కేంద్ర బలగాలను ప్రస్తుతం చిత్తూరు, నగరి, పలమనేరు నియోజకవర్గాలకు పంపడం జరిగింది. ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు జిల్లాకు వచ్చిన కేంద్ర బలగాలు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి, ప్రజల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించే విధంగా చిత్తూరు, నగరి, పలమనేరుల్లో కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎస్పీ జాషువా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి కేంద్ర బలగాలు చిత్తూరు జిల్లాకు వచ్చాయని, కేంద్ర బలగాల కవాతు ముఖ్య ఉద్దేశం ప్రజల్లో ఎన్నికల నిర్వహణ పట్ల నమ్మకం, ఆత్మవిశ్వాసం నింపడం, ఎన్నికల ప్రక్రియలో ఆసాంఘీక కార్యకలాపాలకు పాల్గొనే విచ్ఛిన్నకర శక్తులకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయడం ఈ కవాతు చేస్తోందన్నారు. ఎన్నికల ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి ప్రజలందరు పూర్తి సహకారం అందించాలని, ప్రజలు ఎలాంటి అపోహాలకు గురి కావద్దని, ప్రతి ఒక్కరికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసు శాఖపై వుందని, నిర్భయంగా ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. కేంద్ర బలగాల కవాతు నియోజకవర్గాల్లోని ముఖ్య పట్టణాలు, మండల కేంద్రాల్లో నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

### చిత్తూరులో కేంద్ర బలగాల కవాతు

జిల్లా కేంద్రం చిత్తూరులో ఆదివారం కేంద్ర బలగాల కవాతు నిర్వహించాయి. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రజల్లో ఎన్నికల నిర్వహణపై ఎలాంటి అపనమ్మకం కలుగకుండా వుండేందుకు పోలీసు శాఖ చర్యలు తీసుకొంటోంది. ఈ మేరకు జిల్లాకు వచ్చిన కేంద్ర బలగాల్లో ఒక బలగంను జిల్లా కేంద్రం చిత్తూరులో వుంచి చిత్తూరు నగర వీధుల్లో కేంద్ర బలగాలతో పోలీసు శాఖ కవాతు నిర్వహించింది. పెద్ద ఎత్తున కేంద్ర బలగాలు చిత్తూరులోని వీధుల్లో కవాతు నిర్వహించడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

### రోడ్డుప్రమాదంలో

# ఇద్దరు యువకులు దుర్మరణం

### మరోయువకుడుకి తీవ్రగాయాలు ...

నాయుడుపేట టౌన్ మార్చి 10 ప్రభాతవార్త;



నాయుడుపేట మండలంలోని మామిడికాలువ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డుప్రమాధంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందగా మరోయువకుడు తీవ్రంగా గాయపడ్డారు.పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి.నెల్లూరు నుండి ముగ్గురు స్నేహితులు కలిసి మోటార్‌సైకిల్‌పై కెవిపురంలో వివాహనికి హజరైందుకు వెళుతుండగా మార్గమధ్యలో నాయుడుపేట మండలం మామిడికాలువ సమీపంలో జాతీయ రహదారిపై వెళ్ళుతుండగా అదే మార్గంలో వెనుక నుండి వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది.దీంతో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న వెంకటేష్(21)హేమంత్(17)స్నేహితులు అక్కడికక్కడే మృతిచెందగా మరో స్నేహితుడు భాలాజి కాలువిరిగి తీవ్రంగా గాయపడాడు.బాలాజి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యంకోసం నెల్లూరుకు తరళించారు.మృతిచెందిన వెంకటేష్, హేమంత్‌ల మృతదేహాలను పంచనామ నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరళించారు.మృతిచెందిన వారిపూర్తి వివరాలు తెలియాల్సివుంది.నాయుడుపేట సిఐ సుదాకర్‌రెడ్డి ప్రమాధస్థలాన్ని పరిశీలించి కేసునమోదుచేసి ధర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

# బాలుడి అపహరణ కథ సుఖాంతం

### -తిరుపతిలో స్వాధీనం చేసుకున్న పోలీసులు



తిరుమల, మార్చి 10ప్రభాతవార్తప్రతినిధి:

తిరుమలలో ఆదివారం సాయంత్రం మూడేళ్ళబాలుడు అపహరణకు గురయ్యాడు. బాలుడు తిరుమలలోని పిఎసి 2 వద్ద తల్లిదండ్రుల ఒడినుండి కిడ్నాపర్ సులభంగా ఎత్తుకెళ్ళింది. ఆ కుటుంబం తిరుమల 2టౌన్ పోలీసులను సాయంత్రం 6గంటలకు కలసి ఫిర్యాదు చేయడంతో ఆలస్యంగా వెలుగుచూసింది. గద్వాల్‌కు చెందిన నగేశ్ కుటుంబం ఇద్దరు చిన్నపిల్లలతో కలసి తిరుమలలో పిఎసి వద్ద నిద్రించడంతో మూడేళ్ళ అభినయ్‌ను ఓ మహిళ మాయమాటలతో అక్కడ నుండి తీసుకెళ్ళింది. దీనిపై వెంటనే స్పందించిన తిరుమల 2టౌన్ సిఐత్యనారాయణ తిరుపతి పోలీసులకు సమాచారం అందించి అప్రమత్తం చేశారు. తిరుపతిలో పికెలేఔట్‌లో ఉండటంతో బాలుడ్ని మహిళ నుండి స్వాధీనం చేసుకున్నారు. రాత్రి 8గంటలకు బాలుడు సురక్షితంగా తిరిగి తల్లిదండ్రులను చేరుకున్నాడు.

# వైభవంగా శ్రీ అహోబిల లక్ష్మినరసింహ స్వామి, అమ్మవాస్య పంచ పర్మ మహోత్సవం

### న పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి రోజా

నగరి, మార్చి 10 ప్రభాతవార్త:



శ్రీ అహోబి లక్ష్మినరసింహస్వామి అమావాస్య పంచ పర్మ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యాటక శాఖ పరిధిలోని శ్రీ అహోబిలేశ్వరుల పారువేట ఉత్సవమును మంత్రి రోజా చొరవతో రాష్ట్ర పండుగగా గుర్తించడంతో సంప్రదాయబద్ధంగా లక్ష్మినరసింహస్వామికి, ప్రహ్లాదవరద స్వామికి మంత్రి పట్టు వస్త్రాల సారెను సమర్పించి స్వామివారికి అభిషేకంలో పాల్గొన్నారు. స్థానిక సలహాదారులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధికారులు, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

# ఐరాలలో కొనసాగుతున్న గజరాజుల దాడులు

### - పంటలు ధ్వంసం: భయభ్రాంతులవుతున్న ప్రజలు



ఐరాల, మార్చి 10 ప్రభాతవార్త:

ఐరాల మండలంలో ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతుండడంతో పలు గ్రామాల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మండలంలోని తరచూ ఏనుగుల గుంపుల దాడులు చేస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఈమేరకు శనివారం మండలంలోని చుక్కావారిపల్లె సమీపంలోని పంటపొలాలపై ఏనుగుల గుంపు శుక్రవారం రాత్రి దాడుల చేసి పలువురు రైతులకు చెందిన పంటలను ధ్వసం చేశాయి. అలాగే శనివారం రాత్రి చుక్కావారిపల్లె పక్కన వున్న గుట్టపాళ్యం గ్రామ సమీపంలోని పంటలపై 19 ఏనుగులు గుంపు దాడులు చేసి ధ్వంసం చేశాయి. గుట్టపాళ్యం గ్రామ సమీపంలోని పంటలపై దాడులు చేస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు. ఏనుగుల గుంపు గ్రామాలకు అతి సమీపంలోకి వస్తుండడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తరచూ ఏనుగుల గుంపు దాడులకు పాల్పడుతున్నా అటవీ శాఖ అధికారులు వాటి కట్టడికి తగు చర్యలు తీసుకోకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఏనుగుల దాడుల విషయాన్ని బాధిత రైతులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందిచడంతో వారు పంట నష్టంను పరిశీలించారు. పంటలకు నష ్టం కలిగిస్తుడడంతో రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం

# అమావాస్య పూజలకు కదలి వచ్చిన జనం



శ్రీకాళహస్తి, మార్చి 10 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా భక్తజనులు కదలి తరంగాల్లా కదలి వచ్చారు. ఏడాదిలో ఒక సారి వచ్చే ఆరోజు భక్తులు భోళాశంకరుని దర్శనానికి తహ తహ లాడారు. రాహుకేతుదోష నివారణ పూజలు జరుపుకునేందుకు భక్తులు గంటల కొద్ది నిరీక్షించారు. అమావాస్య ఆదివారం రావటమే అరుదు. అలాంటి పవిత్రమైన రోజు శ్రీకాళహస్తీరాలయంలో ఎటు చూసినా భక్త జనసందోహం చోటు చేసుకుంది.అయితే ఆలయంలో ఎన్నో సంస్కరణలు చేపడుతున్నా అవి తూ తూ మంత్రంగా మారింది. ఆదివారం అమావాస్య సందర్భంగా అడ్డదారుల్లో దర్శనాలు యథావిధిగా సాగాయి. ఇక అడ్డదారిలో దళారుల ఆగడాలు ఆగలేదు.మూడు రోజుల నుంచి శ్రీకాళహస్తిలో భక్తులు తండోపతండాలుగా కదలి వచ్చారు. ఉదయం 3గంటల నుంచి స్థానికులతో పాటు తమిళనాడు, కేరళ, కర్నాటకల నుంచి వచ్చిన భక్తులు శనిశ్వరుని విగ్రహానికి అభిషేకాలు జరుపుకొనుటకు పోటీలు పడ్డారు. గతానుభవాలతో వచ్చిప భక్తులకు సుదర్శనం కోసం ఆలయ ఇఓ నాగేశ్వరరావు పర్యవేక్షణలో సిబ్బంది చర్యలు తీసుకున్నారు. వచ్చిన భక్తులు రాహుకేతు దోష నివారణ పూజలు జరిపించుకొని సంతృప్తి చెందారు..

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## చంద్రబాబుతోనే కాపు..బలిజలకు మేలు

– ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ – కుప్పంలో బలిజ కులస్తుల ఆత్మీయ సమావేశం !!



**కుప్పం, మార్చి 10 ప్రభాతవార్త** తెదేపా అధినేత చంద్రబాబునాయుడు పాలనలోనే కాపు, బలిజలకు మేలు కలిగిందని ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కతి ్మానిపల్లిలోని ఓ కళ్యాణ మండపంలో కుప్పం గ్రామీణ తెదేపా బలిజ కులస్తుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బలిజ నేతలు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కాపు కార్పోరేషన్ ద్వారా రుణాలు, ఇతర సంక్షేమ పథకాలు అందించినట్లు తెలిపారు. వైకాపా పాలనలో కాపు,బలిజలు పూర్తిగా అణచివేయబడ్డారన్నారు. బలిజలకు టిడిపి అండగా ఉంటుందని ఈసారి కుప్పంలో చంద్రబాబుకు లక్ష ఓట్ల మెజార్టీ సాధనలో బలిజలు కీలకపాత్ర పోషిస్తామన్నారు. బలిజలకు కాపు కార్పోరేషన్ ఏర్పాటుచేసి ఐదుశాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. తాము చంద్రబాబు వెంటే నడుస్తామని తీర్మానించారు. అనంతరం గ్రామీణ మండల టిడిపి బలిజ సంఘ అధ్యక్షుడిగా డీలర్ వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా కృష్ణమూర్తి, కంగుంది నాగభూషణంలను ఎన్నుకున్నారు. సమావేశంలో నేతలు డా॥ సురేష్‌బాబు, గోపీనాథ్, సత్యేంద్రశేఖర్, ప్రభాకర్, ప్రేమ్‌కుమార్, విసి మంజునాథ్, వెంకటరమణబాబు, శివశంకర్, భారతి, అనసూయ, సుగుణమ్మ, మణి, వెంకటేష్,చలపతి, రాధాకృష్ణ, రాజేంద్ర పాల్గొన్నారు.

## చంద్రబాబు చేయని అభివృద్ధి పనులు చేశాం



ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్

**శాంతిపురం, మార్చి 10 ప్రభాతవార్త** ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు చేయని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కుప్పంకు అందించారని ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కడపల్లి పంచాయతీలో పోడుచేన్లుకు నూతన తారురోడ్డు, సచివాలయం, ఆర్‌బికె భవనం, వెల్‌నెస్ సెంటర్లను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. సిఎం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అందాయన్నారు. మరోమారు జగనన్నను ఆదరిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కుప్పం ప్రజలు తనకు ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు అండగా ఉంటూ సేవ చేస్తానని పేర్కొన్నారు. అంతకుముందు ఎమ్మెల్సీ భరత్‌కు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో భరత్ సతీమణి దుర్గ పద్మిని, జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, కన్వీనర్ దండపాణి, స్థానిక సర్పంచులు, ఎంపిటిసిలు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుప్పాన్ని మరింత రెట్టింపు అభివృద్ధి చేస్తాం

– ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్



శాంతిపురం, మార్చి 10 ప్రభాతవార్త

తెదేపా ప్రభుత్వం అధికారంలో రాగానే కుప్పాన్ని మరింత రెట్టింపు అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని నల్లరాళ్లపల్లి, చౌడంపల్లి, నిమ్మనపల్లి, దండికుప్పంలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలు ప్రజలకు అందించారు. కుప్పం ప్రజలు ఓటు వేసిది ముఖ్యమంత్రికి అన్న విషయం మరువరాదన్నారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, నేతలు విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, ఉదయ్, నాగరాజు, మణి, రమేష్, చంద్ర, విజయ్‌కుమార్, అనసూయ, చంద్రకళ, సుగుణమ్మ, శ్యామలమ్మ, పౌలారాణి, రూప, హేమ, వేదశ్రీ, సరిత పాల్గొన్నారు.

## అమరనాథరెడ్డిని విమర్శించే అర్హత వైకాపా నేతలకు లేదు - దేశం నేతలు



**రామకుప్పం, మార్చి 10 ప్రభాతవార్త** మాజీ మంత్రి అమరనాథరెడ్డిని విమర్శించే అర్హత వైకాపా నేతలకు లేదని తెదేపా నేతలు పేర్కొన్నారు. ఆదివారం స్థానికంగా మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. అమరనాథరెడ్డిపై మంత్రి పెద్దిరెడ్డి విమర్శలు హాస్యాస్పదమన్నారు. టిడిపి,బిజెపి,జనసేన కూటమి సృష్టించే సునామీలో వైకాపాతో జిల్లాలో పెద్దిరెడ్డి కుట్రపూరిత రాజకీయాలు కూడా కొట్టుకుపోతాయన్నారు. ఈసారి ఎన్నికల్లో భరత్‌కు డిపాజిట్లు దక్కవని అమరనాథరెడ్డిని విమర్శించే స్థాయి ఎమ్మెల్సీ భరత్‌కు లేదన్నారు. సమావేశంలో నేతలు ఆంజనేయరెడ్డి,మునసా ్వమి, ఆనందరెడ్డి, నరసింహులు, రామూర్తి, శివశంకర్, రఫీ, మనోహర్, కామరాజనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## భూ వివాదంలో గాయపడిన వ్యక్తి మృతి



**బంగారుపాళ్యం, మార్చి 10 ప్రభాతవార్త:** మండలంలోని టేకుమంద గ్రామంలో ఈ నెల 3వ తేదీ జరిగిన భూ వివాద ఘర్షణలో గాయపడిన ఓ వ్యక్తి శనివారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఇన్స్‌పెక్టర్ లక్ష్మయ్య తెలిపారు. టేకుమంద గ్రామంకు చెందిన పురుషోత్తం(57), రమేష్‌లకు గత కొంత కాలంగా భూ వివాదం కొనసాగుతుంద. వరుసకు వీరు అన్నదమ్ములు. ఈ నేపథ్యంలో ఈ నెల 3వ తేదీ పురుషోత్తంపై రమేష్ వర్గీయులు రూప్సీ, రంగమ్మ, చిట్టెమ్మ, రాణెమ్మ, శివ, రాజ్‌కుమార్‌లు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. తీవ్రంగా గాయపడిన పురుషోత్తంను కుంటుబ సభ్యులు వెంటనే బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి అనంతరం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తుండగా శనివారం రాత్రి పురుషోత్తం మృతి చెందాడు. మృతుడి తమ్ముడు నరసింహులు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అసంతృప్తి నేతలను కలసి మద్దతు కోరిన కృపాలక్ష్మీ



**పాలసముద్రం, మార్చి 10 ప్రభాతవార్త:** పాలసముద్రం మండలంలో వైకాపా అసంతృప్తి నేతలను తన వైపుకు తిప్పుకోవడానికి నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ కృపాలక్ష్మీ సిద్ధమయ్యారు. ఈ మేరకు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ కృపాలక్ష్మీ ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి అసంతృప్తితో వున్న వైకాపా నాయకులు, కార్యకర్తలను కలిసి తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఇది వరకు నియోజకవర్గ పరిధిలో పార్టీ కార్యకలాపాలు ఎలా జరిగాయో తనకు తెలియదని ఇకపై అందరినీ కలుపుకొని పార్టీని మండలంలో ఉన్నతంగా వుండేలా కృషి చేస్తానని ఆమె నాయకులు, కార్యకర్తలకు హామీ ఇచ్చారు. రాష్ట్రానికి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిగా చేయడానికి క్షేత్ర స్థాయి నుండి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తన తండ్రి డిప్యూటీ సిఎం నారాయణస్వామి నియోజకవర్గంలో ఇప్పటికే అభివృద్ధి పథంలో నడిపారని, దీనిని కొనసాగించి నియోజకవర్గంను మరింత అభివృద్ధి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు మండల వైకాపా అధ్యక్షుడు తులసీయాదవ్, వైస్ ఎంపిపి శేఖర్‌మండడి, జడ్పీటీసీ అన్బుగలన్, ఆర్‌బికె ఛైర్మన్ పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణదేవరాయుల విగ్రహం ఆవిష్కరించిన మంత్రి

**చిత్తూరు, మార్చి 10 ప్రభాతవార్త:** చిత్తూరు గంగినేని చెరువు మున్సిపల్ పార్కు ఆవరణలో ఆదివారం రాష్ట్ర భూగర్భ గనులు, అటవీ, విద్యుత్ శాఖ మంత్రి శ్రీకృష్ణదేవరాయుల విగ్రహంను ఆవిష్కరించారు. బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు డిప్యూటీ సిఎం నారాయణస్వామి, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎంపీ రెడ్డప్ప, చిత్తూరు వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు. బలిజ సంక్షేమ సంఘ నాయకులు, సభ్యులు, మున్సిపల్ కార్పొరేటర్లు, వైకాపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పెద్దిరెడ్డిచే కనకదాస విగ్రహావిష్కరణ



**రామకుప్పం, మార్చి 10 ప్రభాతవార్త** స్థానిక బందార్లపల్లి క్రాస్ వద్ద కురబకులస్తుల ఆరాధ్య దైవం శ్రీ కనకదాస, స్వాతంత్ర్య సమరయోధుడు సంగోలిరాయన్న విగ్రహాలను రాష్ట్ర అటవీ,గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ కురబకులస్తుల ఆరాధ్యదైవం కనకదాస విగ్రహాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. వైకాపా ప్రభుత్వ పాలనలో కురబకులస్తులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా భరత్, ఎంపిగా రెడ్డెప్పను గెలిపించాలని మంత్రి కోరారు.ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, పరిశీలకుడు రెడ్డెప్ప, సీనియర్ నేత జయప్ప, ఎంపిపి సుబ్రమణ్యం, జడ్పీటిసి నితిన్‌రెడ్డి, కన్వీనర్ బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

## తెదేపాలో చేరిన మాజీ సర్పంచ్ భార్య .. యువత



**కుప్పం, మార్చి 10 ప్రభాతవార్త** సామగుట్టపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ హనుమప్ప భార్య జయకాంతమ్మ కుటుంబీకులు, మరో ఇరవై మంది యువత ఆదివారం ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నంల సమక్షంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ నేతృత్వంలో తెదేపాలో చేరారు. ఈసందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కుప్పంలో చంద్రబాబుకు లక్ష ఓట్ల మెజార్టీ సాధనకు తాము శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జ్ రవి పాల్గొన్నారు.అలాగే గుడుపల్లె మండలం గుండ్లసాగరంలో పలువురు వైకాపా నుంచి తెదేపాలో చేరారు. కన్వీనర్ ఆర్.చంద్రశేఖర్, నేతలు బాబునాయుడు, రాజు, హేమాంబరగౌడు, అమీర్ పాల్గొన్నారు.

## గురుకుల విద్యే భారతీయ విద్యావైభవానికి మూలం



–విశ్రాంత డిఎస్పీ సుకుమార్‌బాబు

పుంగనూరు,మార్చి 10 ప్రభాతవార్త :

భారతీయ వైభవానికి కారణం గురుకుల విద్యావ్యవస్థేనని, కొన్నివేల గురుకులాలతో భారతదేశంలో బ్రిటీష్ ప్రభుత్వం కుట్రపూర్వకంగా గురుకులాలను రూపుమాపిందని విశ్రాంత డిఎస్పీ సుకుమార్‌బాబు అన్నారు.ఆదివారం ఉదయం పట్టణంలోని మణికంఠ గురుకులంలో విద్యనభ్యసిస్తున్న పిల్లలకు ఆయన క్రీడాసామాగ్రి విరాళంగా అందించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో గురుకులబోధన ద్వారా చిన్నారులలో సనాతనన విద్యను అందచేస్తున్న మణికంఠ ఆదర్శప్రాయుడన్నారు. ఈసందర్భంగా మణికంఠ మాట్లాడుతూ ప్లిలలకు సంప్రదాయమైన బోధనను అందచేయడంతో పాటూ పలు క్రీడలలో కూడా వారిని తీర్చిదిద్దుతున్నామన్నారు. సుకుమార్‌బాబు మాట్లాడుతూ పట్టణంతో పాటూ గ్రామీణ ప్రాంతాలలో కూడా గురుకులాలు విస్తరించాలని అభిలషించారు.

## 17నుంచి శ్రీకళ్యాణవెంకన్న బ్రహ్మోత్సవాలు

పుంగనూరు,మార్చి 10 ప్రభాతవార్త :



పుంగనూరులోని చారిత్రక శ్రీకళ్యాణ వేంకటరమణ స్వామివారి బ్రహ్మోత్సవాలను ఈనెల 17 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ పర్యవేక్షణాధికారి మునీంద్ర బాబు తెలిపారు. పుంగనూరు పరిపాలకులు వందలాది ఏళ్ళక్రితం నిర్మించిన శ్రీకళ్యాణ వేంకటరమణ స్వామివారికి 17 నుంచి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.17న స్వామివారిమూర్తికి అభిషేకంతో ఉత్సవాల అంకురార్పణ ప్రారంభమౌతుందన్నారు. 18 న ధ్వజారోహణం,19న చిన్నశేషవాహం, హంసవాహనం,20న సింహవానం,ముత్యపు పందిరి,21న కల్పవృక్ష,హనుమంతవాహనం,22న మోహినీ ఉత్సవం,గరుడసేవ,23న సూర్యప్రభ,చంద్రప్రభ,24న కళ్యాణోత్సవం,గజవాహనం, 25నరథోత్సవం ,ధూళోత్సవం,26నవసంతోత్సవం,చక్రస్నానం,27న మహా శాంతి అభిషేకం,తిరుప్పావడ,శయనోత్సవం నిర వ్రహిస్తామన్నారు.కార్యక్రమంలో ప్రధాన అర్చకులు శ్రీనివా సాచార్లు,సిబ్బంది పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో తెలంగాణా ప్రభుత్వ సలహాదారు

కాణిపాకం, మార్చి 10 ప్రభాతవార్త:



తెలంగాణా ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌రావు ఆదివారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు.ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికిదర్శనఏర్పాట్లుచేశారు.అనంతరం వారుస్వామి వారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామి వారి శేష వస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహా ఆలయంలలోకూడాపూజలువారి వెంట ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్‌సిపి పాలనలోనే మైనార్టీలకు సంక్షేమం

– పూతలపట్టు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ డాక్టర్ సునీల్‌కుమార్

**బంగారుపాళ్యం, మార్చి 10 ప్రభాతవార్త:** వైకాపా పరిపాలనలోనే మైనార్టీలు పలు సంక్షేమ కార్యక్రమాలు పొందారని పూతలపట్టు వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జీ డాక్టర్ సునీల్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం బంగారుపాళ్యంలో నియోజకవర్గ మైనార్టీల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశం మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి అధ్యక్షతన చేపట్టారు. మైనార్టీలను ఉద్దేశించి డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మైనార్టీల సంక్షేమం కోసం నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. ఆ రిజర్వేషన్ల వల్ల నిరుపేద మైనార్టీలు ఉన్నత చదువులు, ఉద్యోగాలు పొందారని తెలిపారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి మరో నాలుగు అడుగులు ముందుకు వేసి పలు సంక్షేమ కార్యక్రమా లు చేపట్టి అమలు చేశారన్నారు. కోట్లాది రూపాయలు మైనార్టీల అభివృద్ధికి సిఎం వైఎస్ జగన్ పాలనలో వెచ్చించడం జరిగిందని వివరించారు. ఈ సమావేశంలో జడ్పీ వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డి, నియోజకవర్గ వైకాపా పరిశీలకులు భూమిరెడ్డి మోహన్‌రెడ్డి, రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ ఛైర్మన్ ఎంబి కుమార్‌రాజా, ఎంపిపి అమరావతమ్మ, జడ్పీటీసీ సోమశేఖర్, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ దత్తాత్రేయరెడ్డి, ఎఎంసి వైస్ ఛైర్మన్ సర్దార్, కో–అప్షన్ సభ్యుడు అన్ను, జిల్లా వైకాపా నాయకులు కరీం, బంగారుపాళ్యం, యాదమరి, తవణంపల్లి, ఐరాల, పూతలపట్టు మండలాలకు చెందిన మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## వాకాడు ఎంపిడివో గోపినాథ్‌కు ఘనసన్మానం

కోట,వాకాడు మార్చి 10 ప్రభాతవార్త



వాకాడు ఎంపిడివో తోట గోపినాథ్ 42 సంవత్సరాల పాటు ప్రభుత్వానికి ఉత్తమ సేవలు అందించారని వాకాడు సొసైటి ఛైర్మెన్ కోడవలూరు దామోధర్ రెడ్డి అన్నారు. ఆదివారం కోట మండలం విద్యానగర్‌లోని నేదురుమల్లి సుబ్బారామిరెడ్డి కళాభవన్‌లో ఎంపిడివో ముందుస్తుగా పదవి విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడివో గోపినాథ్‌ను ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఘనంగా శాలువుతో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గోపినాథ్ తన వృత్తిని ఏంతో దైవంగా భావించి విశిష్ట సేవలను అందించారని పేర్కొన్నారు.రాష్ట్ర, జిల్లా స్దాయి లో ఏన్నో ఉత్తమ పురస్కారాలను అందుకున్నారని చెప్పారు. ఎంపిడివో గోపినాథ్ మాట్లాడుతూ తనకు వాకాడు మండల ప్రజా ప్రతినిధులు, ప్రజలు బాగా సహకరించారని పేర్కొన్నారు.

## లలితమ్మ భాస్కర రావు ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు



మేనేజింగ్ ట్రస్టి గౌరీ శంకర్

బాలాయపల్లి, మార్చి 10, ప్రభాతవార్త

త్యాగణం లలితమ్మ భాస్కర రావు మెమోరియల్ ట్రస్ట్ ద్వారా విరివిగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మేనేజింగ్ ట్రస్ట్ గౌరీ శంకర్ తెలిపారు. వెంగమాంబపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చాగణం లలితమ్మ భాస్కర రావు మెమోరియల్ ట్రస్ట్ లలితమ్మ కంటి వెలుగు, శ్రీవెంకటేశ్వర అరవింద ఐ హాస్పిటల్ తిరుపతి వారి సౌజన్యంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. చాగణం లలితమ్మ భాస్కర రావు మెమోరియల్ ట్రస్టు ద్వారా విరివిగా చేపడుతున్నట్లు వివరించారు.

## సిద్ధం సభకు తరలివెళ్ళిన వైసిపి నేతలు

వెంకటగిరి టౌన్, మార్చి 10, ప్రభాతవార్త

సిఎం జగన్మోహన్ రెడ్డి నిర్వహించే సిద్ధం భారీ బహిరంగ సభకు నియోజకవర్గం నుండి వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సభకు పార్టీ నాయకులు వెళ్లారు. పట్టణం గ్రామాల నుండి నేదురుమల్లి ఏర్పాటు చేసిన బస్సుల్లో సిద్ధం సభకు తరలివెళ్లారు.

## ఎన్ని సిద్ధం సభలు నిర్వహించినా వైసిపి గెలవదు

మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి టౌన్, మార్చి 10, ప్రభాతవార్త



ఎన్ని సిద్ధం సభలు నిర్వహించిన వైసిపి గెలవదని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. 12వ వార్డు మల్లమ్మ గుడి వీధి ప్రాంతాల్లో భవిష్యత్తు గ్యారెంటీ బాబు షూరిటీ మల్లమ్మ గుడి వీధి ప్రాంతాల్లో భవిష్యత్తు గ్యారెంటీ బాబు షూరిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిఎం సభలకు ఆర్టీసి బస్సులను పంపడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. 12వ వార్డు మల్లమ్మ గుడి వీధిలో తాను చేసిన అభివృద్ధి తప్ప ఈ ప్రభుత్వంలో చిల్లి గవ్వ ఖర్చు పెట్టలేదని తెలిపారు. ఇంటింటికి తిరిగి భవిష్యత్తు గ్యారెంటీ బాబు షూరిటీ కరపత్రాలను ఆయన పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి ఛైర్మన్ పి. రాజేశ్వర రావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ రాజేశ్వర రావు, మాజీ కౌన్సిలర్ పి. విశ్వనాథం, నాయకులు గంగాధర్, సత్యనారాయణ, నరసింహులు, చంద్రారెడ్డి, సుధాకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పేటలో ఘనంగా సావిత్రిబాయిపూలే వర్ధంతి వేడుకలు



**నాయుడుపేట టౌన్ మార్చి 10 ప్రభాతవార్త;** నాయుడుపేటలో సావిత్రిబాయిపూలే వర్ధంతి వేడుకలను బిసినాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు.సూళ్ళూరుపేట నియోజకవర్గం బిసిసంఘం అధ్యక్షుడు జువ్వలపాటి మస్తాన్ సావిత్రిబాయిపూలే,జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళర్పించారు.ఈసందర్భంగా జువ్వలపాటి మస్తాన్ మాట్లడుతూ మహిళలు అబివృద్ధి,హక్కులకోసం ఎన్నొ ఉద్యమాలు చేపట్టిన ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు.సమాజంలో ఆమె మహిళల కోసంచేసిన సేవలను ప్రతిఒక్కరు గుర్తించుకోవాలన్నారు.బిసిసంక్షేమ సంఘం టౌన్ అధ్యక్షుడు ఆవుల వినోద్,షరీప్,చెంగయ్య,తదితరులు పాల్గొన్నారు.

## పేటలో సిద్దంసభకు వెళ్లిన వైసిపి నాయకులు

**నాయుడుపేట టౌన్ మార్చి 10 ప్రభాతవార్త;** ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం మేదరమెట్ల వద్ద నిర్వహిస్తున్న సిద్దంసభకు నాయుడుపేట నుండి వైసిపి నాయకులు భారీగా తరళివెళ్ళారు.సూళ్ళూరుపేట శాసనసభ్యులు కలివేటి సంజీవయ్య సూచనల మెరకు నాయుడుపేట మండలం పూడేరు,మేనకూరు గ్రామాల నుండి ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి,జడ్‌పిటిసి కట్టా జ్యోతి ఆధ్వర్యంలో సుమారు 100మంది నాయకులు సిద్దంసభకు బస్సుల్లో బయటుదేరి వెళ్ళారు.ఆమె వెంట బత్తల భూపయ్య,వెంకటేశ్వర్లు,సర్ప ంచ్ సురేష్,నల్లు కస్తూరయ్య,పలువురు నాయకులు ఉన్నారు.

## ఆలయాల్లో విజయశ్రీ ప్రత్యేక పూజలు ...



**నాయుడుపేట టౌన్ మార్చి 10 ప్రభాతవార్త;** నాయుడుపేట పట్టణంలోని అగ్రహారపేటలో వెలసియున్న శ్రీమాతమ్మ దేవాలయంలో సూళ్ళూరుపేట తెలుగు దేశంపార్టీ అభ్యర్ది నెలవల విజయశ్రీ స్థానిక నాయకుల తో కలిసి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలువురు తెలుగుదేశంపార్టీ నాయకులు ఆమెకు పూలమాలలు,శాలువాలు కప్పి ఘనస్వాగతం పలికారు.ఈసందర్భంగా నెలవల విజయశ్రీ మాట్లడుతూ త్వరలో జరగునున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.ఆమె వెంట మాజీఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం,మాజీఎఎంసి చేర్మేన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, 786రపి,నాయుడుపేట పట్టణ అధ్యక్షుడు కందల కృష్ణరెడ్డి,తదితర నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

## రక్తదానం మరొకరికి ప్రాణదానం

గూడూరు, మార్చి 10, ప్రభాతవార్త



రోటరీ క్లబ్ వెస్ట్ గూడూరు వారోత్సవాలలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మాజీ రోటరీ క్లబ్ వెస్ట్ గూడూరు అధ్యక్షుడు ధనుంజయ రెడ్డి తెలిపారు. గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోటరీ క్లబ్ వెస్ట్ గూడూరు ఆధ్వర్యంలో ఎస్ఎల్ఎన్ బాబు సహకారంతో రక్తదాన శిభిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు ధనుంజయరెడ్డి మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అయితే రక్తదాన శిభిరాల ద్వారా రక్తాన్ని సేకరించి ఆపదలో ఉన్న రోగులకు అందించడం ద్వారా ఆత్మ సంతృప్తి కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సనత్ కుమార్ రెడ్డి, ఆడిటర్ రామ్మోహన రావు, వాసు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కనుమూరికి స్వాగతం పలికిన టిడిపి నేతలు

గూడూరు, మార్చి 10, ప్రభాతవార్త



గూడూరు పట్టణంకు చెందిన ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం మాజీ ఛైర్మన్ కనుమూరు హరిశ్చంద్ర రెడ్డి ఇటీవల టీడీపీలో చేరారు. ఆదివారం గూడూరు పట్టణంలోని టిడిపి పార్టీ కార్యాలయంకు విచ్చేసిన సందర్భంగా వారికి నాయకులతో కలసి మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కనుమూరి మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి గెలుపునకు కృషి చేస్తామన్నారు. అదే విధంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ కనుమూరు హరిచంద్రరెడ్డి పార్టీలకు రావడం చాలా సంతోషదాయకమని గూడూరు పట్టణాన్ని కనుమూరు హరిచంద్రరెడ్డి ట్రస్ట్ ద్వారా కోనేటి మిట్ట వెంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలో ఉన్న లైబ్రరీని నూతనంగా నిర్మించాడని యువతకు ప్రతి సంవత్సరం క్రీడా పోటీ నిర్వహించి బహుమతుల ప్రధానం చేసే మనసున్న మహారాజని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నెలబల్లి భాస్కర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు, కొండూరు వెంకటేశ్వర్లు రాజు, నరసింహ నాయుడు, చంద్రమౌళి, పెంచలయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం, జనసేన, బీజేపిల కలయిక చారిత్రాత్మకం

మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

**గూడూరు, మార్చి 10, ప్రభాతవార్త** 2024 ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీల కలయిక చారిత్రాత్మకమైందని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన, బీజేపీల కూటమిని పార్టీ సభ్యులుగా మేమందరం స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్రంలో నెలకొన్న క్లిష్టపరిస్థితుల ఆధారంగా అధినేత చంద్రబాబు నాయుడు పొత్తు నిర్ణయం తీసుకున్నారు. వైసిపి నిరంకుశ పాలనను తుదముట్టించేందుకు బిజేపి, టిడిపి, జెఎస్‌పి కలిసి పోటీ చేయనున్నాయి. ఈ పాలనలో ఆంధ్రప్రదేశ్ ఆర్ధిక సంక్షోభంలోకి నెట్టారన్నారు. అప్పులాంధ్ర ప్రదేశ్‌గా మార్చిందన్నారు. కులంతో సంబంధం లేకుండా బీసీలు, ఎస్సీ, ఎస్టీలపై దాడులు ఈ ప్రభుత్వంలో జరిగాయన్నారు. వైసిపి పాలనలో ప్రభుత్వం అంటే కేవలం జగన్ రెడ్డి, విజయసాయి రెడ్డి, సజ్జల రామకృష్ణ రెడ్డి, ధనుంజయ్ రెడ్డిగా మారిందన్నారు. ఈ ప్రభుత్వంలో బీసీలను ఎంత హీనంగా చూశారో వైఎస్ఆర్‌సిపి బీసీ సెల్ అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి మాటల్లోనే విన్నామన్నారు. అనంతరం ఇందిరా నగర్‌కు చెందిన వెంకటేశ్వర నాయుడు, 25 కుటుంబాలు పాశిం సునీల్ కుమార్ నివాసం వద్ద తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగిందన్నారు.

## సిద్ధం సభకు వెళ్లిన ఎమ్మెల్సీ మేరుగ మురళీధర్

**గూడూరు, మార్చి 10, ప్రభాతవార్త** గూడూరు పట్టణ సమీపంలోని పోటు పాలెం కూడలి వద్ద జాతీయ రహదారి పై ఆదివారం ప్రకాశం జిల్లాలోని మేదరమెట్ల వద్ద సిఎం జగన్మోహన్ రెడ్డి ఆఖరి సిద్ధం సమావేశానికి మేము సిద్ధం అంటూ గూడూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి మండల కన్వీనర్ల ఆధ్వర్యంలో గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్పు మేరిగ మురళి ఆధ్వర్యంలో 150 బస్సుల్లో భారీగా వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు తరలిపోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు బొమ్మిడి శ్రీనివాసులు, ఎద్దల మధుసూధన్ రెడ్డి, నాయకులు చేవూరు విజయ మోహన్ రెడ్డి, మల్లు విజయకుమార్, మద్దూర్ బాయ్, బుర్ల విష్ణువర్ధన్ రెడ్డి, దువ్వూరు చంద్రశేఖర్ రెడ్డి, కట్టా రవీందర్ రెడ్డి, రమేష్ రెడ్డి, కట్ట రామిరెడ్డి, కూలిపోయిన చంగయ్య, నాసిన నాగులు, దిలీప్ రెడ్డి, వందలాది మంది కార్యకర్తలు, నాయకులు తదితరులు ఉన్నారు.

## వైకాపా నాయకులు టిడిపిలో చేరిక

**వాకాడు, మార్చి 10, ప్రభాతవార్త** వాకాడు మండలం కొండూరు గ్రామంలో ఆదివారం గూడూరు టిడిపి అసెంబ్లీ అభ్యర్థి పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో వైకాపా నాయకులు టిడిపి పార్టీలో చేరారు. వాకాడు మండలం సిద్ధిగుంట పాలెం గ్రామం నుండి వైకాపా నాయకులుకు పార్టీ కండువా వేసి సాధారంగా ఆహ్వానించారు. ఇంటింటికి వెళ్లి మాజీ ఇటువంటి చంద్రబాబు నాయుడు చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ మధురెడ్డి, మాజీ జడ్పిటిసి సభ్యురాలు బత్తిన ప్రమీల, తిరుమూరు శ్రీనివాస్ రెడ్డి, అన్నమేటి చంద్రయ్య, సుధాకర్ రెడ్డి, కోట శ్రీనివాసులు, కుంచం దయాకర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జగన్ మళ్లీ సీఎంను చేయడానికి ప్రజలు సిద్ధం

**కోట,మార్చి 10 ప్రభాతవార్త** మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి చేయడానికి ప్రజలు సిద్దంగా ఉన్నారని సిద్దవరం సొసైటి అధ్యక్షులు పాదర్తి రాధాకృష్ణరెడ్డి అన్నారు.ఆదివారం సిద్దవ సభకు వేళ్లేందుకు ముందుగా ఆయన కోట మండలం విద్యానగర్‌లో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర వైకాపా కార్యదర్శి, పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు వివిధ వాహనాల్లో తరలి వేళ్లారు.ఆయనవంట మాజీ జెడ్పిటిసీ సభ్యులు ఉప్పల ప్రసాద్‌గౌడ్,రాంబాబు, ప్రభాకర్,తదితరులు ఉన్నారు,

## ప్రతి ఇంటికి మేలు జరిగి ఉంటే జగన్‌కు ఓటువేయండి

**కోట,మార్చి 10 ప్రభాతవార్త** ప్రతి ఇంటికి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మేలు జరిగిందని తిరుపతి వైకాపా పార్లమెంట్ మైనార్టీ సెల్ నాయకులు షెక్ .మోబిన్‌బాషా అన్నారు. ఆదివారం కోట మండలం కర్లపూడి గ్రామంలో నేను సిద్ధం మా బూత్ సిద్ధం అనే కారక్రమంను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు పార్టీలకు, మతాలకు, వర్గాలకు అర్హత ప్రామాణికంగా అందాయని పేర్కొన్నారు. తమ నాయకులు ఒకటే చెబుతున్నారు. తమ వల్ల మేలు జరిగి ఉంటేనే తనకు ఓటు వేయమని కోరుతున్నారని చెప్పారు.ప్రతి 100 కుటుంబాలతో సంక్షేమ పథకాలపై చర్చించాలని ఆయన కోరారు. మండల కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్ రెడ్డి,సిద్దవరం మాజీ సొసైటి ఛైర్మెన్ సన్నారెడ్డి చెంచురెడ్డిరాఘవరెడ్డి,పామల సెక్రటిరి పామల సురేంద్ర, గృహసారధులు, వల్లీంటర్లు,పాల్గొన్నారు.

## ప్రతిభ కలిగిన విద్యార్థులకు ప్రోత్సాహాలు ఇస్తాం

**కోట,మార్చి 10 ప్రభాతవార్త** బిసీల సమస్యలు ఏమైన ఉంటే తమ కార్యాలయాలనికి వచ్చి చెప్పుకోవచ్చనని బిసి కుల ఐక్యవేధిక అధ్యక్షులు మర్లపల్లిగోపి అన్నారు.ఆదివారం కోటలోని బిసి కార్యాలయాంలో బిసి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదవుల్లో ప్రతిభ కలిగిన పేద బిసీ విద్యార్ధలకు నగదు పురస్కారాలను అందచేయడం జరుగుతుందని గోపి చెప్పారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి చేయాత ఇవ్వడం, బిసి పేద విద్యార్థులకు విద్యాసామగ్రి, బిసి వృద్ధులకు చేయాత, బిసి కులాల ఎవరైన మృతి చెందితే అంత్యక్రియలకు ఆర్థిక సహాయం, అనాద పిల్లలకు ఆర్థిక సహాయం చేయడం లక్ష్యంగా తమ సంస్ద పని చేస్తుందన్నారు. ఉప్పల కోటీశ్వరరావుకు అనే వికలాంగులకు ట్రైసైకిల్‌ను ఇవ్వడం జరిగిందన్నారు. నాయకులు రవి,తదితరులు పాల్స్నారు.

## ఏపిఎస్‌పిడిసిఎల్ యూనియన్ ఆధ్వర్యంలో అన్నదానం

శ్రీకాళహస్తి, మార్చి 10 ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (1104) ఆధ్వర్యంలో స్వామిఅమ్మవార్ల కళ్యాణోత్స వానికి విచ్చేసే భక్తులకు స్థానిక నగరివీధిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎపిఎస్‌పిడిసిఎల్ డిస్కం కార్యదర్శి వి.దేవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈసం దర్భంగా డిస్కం కార్యదర్శి మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా తమ యూనియన్ సేవా చేస్తోందన్నారు. సుమారు 5వేలమందికి పైగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో తిరుపతి రూరల్ డిఈఈ వాసురెడ్డి, డిఈఈలు, ఎఎఓ, మున స్వామి, సుందరం, పవన్‌కుమార్, ఈశ్వర్‌ప్రసాద్‌బాబు, గుర్రప్ప, వినోద్‌బాబు, మురళీతదితరులుపాల్గొన్నారు.

## సూపర్‌సిక్స్‌తోనే రాష్ట్ర ప్రజల సంక్షేమం



.శ్రీకాళహస్తి, మార్చి 10 ప్రభాతవార్త రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి యూనిట్ ఇన్‌ఛార్జి మరియు 22వ వార్డు ఇన్‌ఛార్జి నెమళ్ళూరు సుబ్రమణ్యం అన్నారు. ఆదివారం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి ఆదేశాలతో క్లస్టర్ ఇన్‌ఛార్జి, పట్టణ పార్టీ అధ్యక్షుడు గెడిపూడి విజయకుమార్ సూచనలతో 56వ బూత్‌లో ప్రతి ఇంటికి వెళ్ళి బాబు సూపర్-6 సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా బుజ్జి మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్దిలో అడుగులు వెయ్యాలన్నా, సంపద సృష్టించాలన్నా, సంక్షేమ పథకాలు అందరికీ అందాలన్నా, శాంతిభద్రతలు అదుపులో ఉండాలన్నా, పేద మద్య తరగతి ప్రజలపై పన్నులు నిత్యావసర వస్తువులు భారం తగ్గాలన్నా, ఉద్యోగ అవకాశాలు రావాలన్నా తెలుగుదేశం, జనసేన, బిజెపి ఉమ్మడి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలను అభ్యర్ధించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీకి ఓట్లు వేసి బొజ్జలసుధీర్‌రెడ్డిని ఎంఎల్‌ఏగా, చంద్రబాబునాయుడును రాష్ట్ర ముఖ్యమంత్రిగా గెలిపించాలని బుజ్జిఓటర్లను అభ్యర్ధించారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌ఛార్జి చెంబేటి బాలయ్య, బూత్ సభ్యులు షేక్.కాలేషా, షేక్.ఫరీద్, రమణయ్యలు పాల్గొన్నారు.

## అంకాళమ్మ ఆలయం వద్ద భక్తులకు అన్నదానం



శ్రీకాళహస్తి, మార్చి 10 ప్రభాతవార్త పట్టణంలోని పివిరోడ్డులో వెలసి ఉన్న అంకాళమ్మ ఆలయం వద్ద గత రెండు సంవత్సరాల నుంచి అమావాస్య సందర్భంగా మరాఠీపాళెం వాస్తవ్యులు యశ్వంత్‌రావు, బాలాజీరావు, సత్యనారాయణరావు, జయగణేష్‌ల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహి స్తున్నారు. ఈనెల సహాయ సహకారాలు అందించిన శివకుమార్‌రెడ్డి, క్రాంతికుమార్, డాక్టర్ కృపా నిధి, ఉపేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రావు, రాఘవేంద్ర, గణేష్ బాబు, వినీత్‌రెడ్డి, నాగేష్, బాబ్జీరావు, వినోద్‌రావు, అనూష, షర్మిళ, కల్పన, కృష్ణప్రియ, శ్రీరాం, అరుణ్, భరత్, అమర్నాద్, సాయిప్రదీప్, అవినా ష్‌రెడ్డి, బాలాజీ, ఓంకార్, నాగేంద్ర, వరప్రసాద్, లీలామోహన్, దిలీప్, మయూర్‌ప్రసన్న, రాజేశ్వరరావు, దినకర్‌రెడ్డి, కార్తికేయన్, చేతలిశర్మ, జయంత సింగ్, ఆనంద, దీపాన్ష్‌యాదవ్, హరిహరకుమార్, శివప్రసాద్, వినోద్‌కుమార్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

## ఆధ్యాత్మిక వేదికల్లో రాజకీయ ప్రసంగాలు దురదుష్టకరం

శ్రీకాళహస్తి, మార్చి 10 ప్రభాతవార్త ఆధ్యాత్మిక వేదికల్లో రాజకీయ ప్రసంగాలు దురదుష్టకరమని జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ అన్నాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో జరిగిన రథోత్సవంచ తెప్పోత్సవంలో శ్రీకాళహస్తి ఎంఎల్‌ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి తమ రాజకీయ ప్రచారం చేయడం దురదుష్టకరమని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఎంఎల్‌ఏ రాజకీయ ప్రసంగాలు చేయడం సరికాదన్నారు. ఇలాంటివి మానుకోవాలని ఓ ప్రకటనలో ఖండించారు.

## కోలా ఆనంద్‌కు ఎంఎల్‌ఏగా అవకాశం కల్పించండి



తొట్టంబేడు, మార్చి 10 ప్రభాతవార్త బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటిపురందేశ్వరి, రాష్ట్ర కార్యదర్శి అసెంబ్లీ పార్టీ కన్వీనర్ కోలా.ఆనంద్‌కుమార్ సూచనలతో మండలంలోని కొత్తకండ్రిగ గ్రామంలో మండల అధ్యక్షులు వేడాంకృష్ణయ్య ఆధ్వర్యంలో కార్యకర్తలతో కలసి విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కార్యకర్తలతో కలసి ఎన్నికల ప్రచారంలో భాగంగా కోలా.ఆనంద్ కుమార్ గెలుపు కోరుతూ ఇంటింటికి వెళ్ళి నరేంద్రమోడీ సంక్షేమ పథకాల కరపత్రాలు, క్యాలెండర్లు పంపిణీచేస్తూ కేంద్రానికి నరేంద్రమోడీ కోసం నియోజకవర్గంలో కమలం గుర్తుకు ఓటు వేసి ఆనంద్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మేళాగారంసుబ్రమణ్యంరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కందాటి మునిరాజ, మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు చొక్కాని రవిచంద్ర, మండల ఓబిసిమోర్చా అధ్యక్షులు పుచ్చకాయల రమేష్‌యాదవ్, కాశీ, రాజనాల తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి కమలం-నరేంద్రమోడీ సంక్షేమ పథకాలు

-గరికపాటి రమేష్‌బాబు



శ్రీకాళహస్తి, మార్చి 10 ప్రభాతవార్త

రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు దగ్గుబాటిపురందేశ్వరి ఆదేశాల మేరకు రాష్ట్ర కార్యదర్శి మరియు నియోజకవర్గ కన్వీనర్ కోలా.ఆనంద కుమార్ సూచనల మేరకు పట్టణంలోని 5వ వార్డు బహదూరుపేటలో ఇంటింటికి నరేంద్రమోడీ సంక్షేమ పథకాలకు సంబందించి కరపత్రాలను పంపిణీచేశారు. ఈసందర్భంగా పట్టణ పార్టీ అధ్యక్షుడు గరికపాటిరమేష్‌బాబు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అన్ని విధాలుగా సంక్షేమం మరియు అభివృద్ది పథకాలను ఇస్తున్నారని ఉచిత రేషన్‌బియ్యం, ప్రతి మనిషికి రూ.5లక్షలు ఉచిత ఆరోగ్య బీమా, విశ్వకర్మ యోజన పథకం, వృద్దులకు పెన్షన్లు ఇస్తున్నారని, ప్రతి ఇంటికి మంచినీరు, మరుగుదొడ్లు ఇలాంటివి ఎన్నో చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. కేంద్రంలో మరొక్కసారి, ఏపిలో ఒకసారి బిజెపికి అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జివి.అమర్నాద్, ఓబిసి మోర్చా అధ్యక్షులు కన్నా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శులు మద్దువాసుయాదవ్, పుణ్యండిల్లీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 127వ సావిత్రి బాయ్ పూలే వర్ధంతి వేడుకలు

తిరుపతి మహిళావర్సిటీ, మార్చి 10, ప్రభాతవార్త

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలు ఘటించి నివాళులు అర్పించారు. భారతదేశానికి మహిళా లోకానికి ఆదర్శంగా నిలిచారని వారి సేవలను గుర్తు చేసుకుంటూ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ చైతన్య వేదిక కన్వీనర్ టి. గోపాల్ మాట్లాడుతూ భారతదేశంలో 40 కోట్ల మంది మహిళలు చదువుకుని వారి కుటుంబ, సమాజ శ్రేయస్సుకు భారత దేశపు యొక్క అభివృద్ధికి పాటుపడుతున్నారంటే దానికి కారణం మహిళా విద్యకు శ్రీకారం చుట్టిన భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే కారణమని గుర్తు చేశారు. జాతీయ బీసీ జేఏసి అధ్యక్షులు డాక్టర్ ఉప్పర నాగేశ్వర రావు మాట్లాడుతూ సమాజంలో 60 శాతం ఉన్న బీసీలను సాంప్రదాయ రాజకీయ పార్టీలన్నీ కేవలం ఓటు బ్యాంకు గానే ఉపయోగించుకుంటున్నాయని రాజ్యాధికారంలో జనాభా అనుసరించి భాగస్వామ్యం ఇవ్వటం లేదని వాపోయారు. ఆంధ్రప్రదేశ్ బీసీ ఫోరం కన్వీనర్ యువతరం నాయకుడు బడి సుధా యాదవ్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలన్నీ యువతరాన్ని ప్రోత్స హించాలని అత్యధిక ఓటు బ్యాంకు కలిగిన బీసీ నాయకులకు రాబోయే ఎన్నికల్లో జనాభా అనుగుణంగా అసెంబ్లీ సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పెద్దపాలెం పాపయ్య నాయుడు, కమర్షియల్ డిపార్ట్మెంట్ సుబ్రమణ్యం, ప్రముఖ కవి గాయకుడుడాక్టర్‌నిడదాలరవణప్ప, టిటిడిఉద్యోగులసంఘంనాయకులు కామరాజు, దేశయ్య పాల్గొన్నారు.

## చంద్రబాబు సిద్ధాంతాలకోసం పనిచేద్దాం

-ఒప్పందంలో జనసేన అభ్యర్థి గెలుపు లక్ష్యం -ఆత్మీయ సమావేశంలో సుగుణమ్మ



తిరుపతి, మార్చి 10ప్రభాతవార్త: తిరుపతి నియోజకవర్గ ఎమ్మెల్యే టిక్కెట్ ఈ ఎన్నికల్లో జనసేన పార్టీకి కేటాయిస్తున్నారని, అభ్యర్థి ఎవరైనా గెలుపే లక్ష్యంగా టిడిపి శ్రేణులు పనిచేయాలని ఇన్‌ఛార్జి ఎం.సుగుణమ్మ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. టిడిపి టిక్కెట్ విషయంలో తన స్వరం మార్చుకోవడం...పార్టీలో ముగ్గురు నలుగురు నేతలు తనంటే తనేనని పోటీకి రావడంతో తిరుపతి స్థానాన్ని మిత్రపక్షం జనసేనకు కేటాయించారు. ఈ నేపధ్యంలో తిరుపతిలో ఏ పార్టీ అయినా కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన సమయంలో తిరుపతి నుండి పోటీచేసి గెలవడం పరిపాటి అని, తిరుపతిలో టిడిపి నేతలు, జనసేన నేతలు కలసి ఉమ్మడిగా పనిచేద్దామని, ఎన్నికల్లో చంద్రబాబు సిద్ధాంతాలకోసం పనిచేసి, అభ్యర్థిని గెలిపించుకుందామన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన గెలిచి ప్రభుత్వం ఏర్పాటు తథ్యమని, ఆ తరువాత మనందరికీ అధికారం ఉన్నట్లేనని సుగుణమ్మ విజ్ఞప్తి చేశారు. తిరుపతి ఒక సెంటిమెంట్ అని, అందరూ చంద్రబాబు ఆదేశాలు, సిద్ధాంతాలకోసం కట్టుబడి ఉండాలన్నారు. ఆత్మీయసమావేశంలో టిడిపి పరిశీలకుడు చిట్టిబాబు. తిరుపతి నాయకులు పాల్గొన్నారు.

## అనాధలకు అమ్మలా మాత బాలికల ఆవాసం

తిరుపతి, మార్చి 10ప్రభాతవార్త: కోవిడ్ సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన బాలికలకు, కుటుంబంలో ఎలాంటి ఆదరణ లేని ఆడపిల్లలను అక్కున చేర్చుకుని అమ్మలా చేరదీసిన మాత బాలికల ఆవాసం ఆదివారం ప్రథమవార్షికోత్సవం జరిగింది. తిరుపతి కేసవా సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఆవాసంలో అనాధ పిల్లలకు అన్ని విధాలా ఆదుకునేందుకు పలువురు ప్రముఖులు, దాతలు ముందుకు వచ్చారు. చిన్మయ ఆశ్రమం పవిత్రానందస్వామి. బిజెపి నాయకులు గుండాల గోపీనాధరెడ్డి, పెనుబాలచంద్రశేఖర్, ఆవాసం అధ్యక్షుడు భాస్కర్‌రావు, ఇండియన్ బ్యాంకు చీఫ్ మేనేజర్ లలిత, అక్కిపల్లి మునికృష్ణయ్యయాదవ్ పాల్గొని తమవంతుగా ముందుకు వచ్చారు.

## వైసీపీకి ఓటమి ఖాయం - గాలి భానుప్రకాష్



విజయపురం, మార్చి 10 ప్రభాతవార్త: వైసీపీకి ఓటమి ఖాయమని నగరి టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్ర కాష్ పేర్కొన్నారు. ఆదివారం మండలకేంద్రమైన విజయపురంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి బాబు సూపర్‌సిక్స్ కరపత్రాలు పంపిణీ చేసి సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. మండల కేంద్రమైన విజయపురంలో గతంలో టీడీపీలో సమన్వయం లోపం ఉండేదని, ప్రస్తుతం పసుపు దళం ఏకమై ఐక్యమత్యంగా పార్టీ కార్యక్రమాలు చేస్తుంటే ఆనందంగా ఉందన్నారు. టీడీపీకి పూర్వ వైభవం వచ్చిందని, రాష్ట్రంలో టీడీపీ అధికారంలో రావడం ఖాయమన్నారు. అనంతరం పాతార్కాడుకు చెందిన వైసీపీ కార్యకర్తలు నాగభూషణం యాదవ్, విజయకుమార్, వేదనారాయణ యాదవ్, సురేష్, వెంకటేశులు భానుప్రకాష్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. విజయపురంలోకాంగ్రెస్, వైసీపీ నుంచి రఘు, రఘురామరాజు, డీలరు రామచంద్రరాజు, రమేష్‌యాదవ్, రిటైర్ టీచరు రామచంద్రరాజు తదితరులు టీడీపీ సొంత గూటికి చేరారు. ఈ కార్యక్రమంలో భాగంగా విజయపురం, మిట్టూరు, దక్షిణపు ఆది ఆంధ్రవాడ ప్రాంతాల్లో పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి, చినబాబు, టీడీపీ రాష్ట్ర బీసీసెల్ ఉపాధ్యక్షుడు చుక్కా ధనంజయయాదవ్, మండల టీడీపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్‌రాజు, బాబుయాదవ్, జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి స్వామినాథన్, సమన్వయకర్త మెరుపుల మహేష్, నాయకులు మురళీరాజు, కపిల్, అశోక్, శామువేలు, బాల సుబ్రహ్మణ్యంరాజు, దశరథరాజు, వేణుగోపాలనాయుడు, సుధాకర్‌రాజు, నారాయణరాజు, మునిశేఖర్‌శెట్టి, శివయ్యనాయుడు, హరిరాజు, గాలి రమేష్, కొందూరు దాము, రవిరాజు, రాజేంద్రరాజు, గుణ భూషణమ్మ, మునిభాస్కర్‌రాజు, ఏళుమలై, మురళి, ఉదయ్, శివలింగం, శరత్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా లోకానికి ఆదర్శం సావిత్రిబాయి పూలే



రేణిగుంట, మార్చి 10 ప్రభాతవార్త: మహిళా లోకానికి సావిత్రిబాయి పూలే ఆదర్శవంతురాలని ఐద్వా మహిళ నేతలు అన్నారు. రేణిగుంట పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మహిళా మణిమకుటం సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఐద్వా మహిళలు ఆదివారం నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మూర్ఖపు పోకడలను ధిక్కరించి ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకుని మహిళా లోకానికి ఆదర్శంగా నిలిచిన తొలి ఉపాధ్యాయురాలిగా ఆమెను అభివర్ణించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ నాయకులు తమ సహకారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి రాజేశ్వరి, సత్యశ్రీ, ఈశ్వరమ్మ, రాజమ్మ, రైల్వే క్లీనింగ్ వర్కర్స్ నాయకులు మునిలక్ష్మి, అమ్ములు, సంఘమిత్ర నాయకురాలు మనీలా తదితరులు పాల్గొన్నారు.

## వయో వృద్ధులకు డిజిటల్ సేఫ్టీపై అవగాహన



రేణిగుంట, మార్చి 10 ప్రభాతవార్త: రేణిగుంట ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఆదివారం వయో వృద్ధులకు హైదరాబాద్‌కు చెందిన హెల్ప్ ఏజ్ ఇండియా, గూగుల్ సంస్థ ప్రతినిధులు డిజిటల్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. ప్రస్తుత ప్రపంచం అంతర్జాలంతో(ఇంటర్నెట్) ముడిపడి ఉందని ప్రతినిధులు తెలిపారు. ఏటీఎం, క్రెడిట్ కార్డులు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఫోన్‌పే, గూగుల్‌పే, లాంటి అత్యవసర సమాచార ధన లావాదేవీలు మొబైల్ ఫోన్ల ద్వారా డిజిటల్ వ్యవస్థపై ఆధారపడి ఉన్నాయన్నారు. డిజిటల్ వ్యవస్థపై అవగాహన లేకపోతే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. డిజిటల్ వ్యవస్థలో పోలీస్‌స్టేషన్, రైల్వేస్టేషన్, బ్యాంకులు, ట్రాన్స్‌పోర్టు సర్వీసులు అనుసంధానమై ఉండడం వల్ల సందేహాలను ఆయా శాఖల ద్వారా నివృత్తి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రైల్వే పెన్షన్ అసోసియేషన్ చైర్మన్ అసన్, విజయకుమార్, పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి జయంత్‌కుమార్, రంగయ్య, రవికుమార్, సుధాకర్‌బాబు, వరలక్ష్మి, రిటైర్డ్ ఎస్ఐ మదీనా, రామూర్తి, ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ జులియన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సిద్ధం సభకు తరలిన వైసిపి శ్రేణులు

ఏర్పేడు, మార్చి10, ప్రభాతవార్త; ప్రకాశం జిల్లా మేదరమిట్ట వద్ద ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదివారం నిర్వహించన్ను సిద్ధం బహిరంగ సభ విజయవంతం చేసేందుకు మన్నసముద్రం గ్రామం నుంచి సింగిల్ విండో మాజీ చైర్మెన్ నాగార్జున్‌రెడ్డి నేతృత్వంలో వైసిపి అభిమానులను తరలించేందుకు బస్సు ను ఏర్పాటు చేశారు. అదేవిదంగా పాపానాయుడుపేట గ్రామం నుంచి అర్జున్‌బాబు నేతృత్వంలో బస్సు బయలు దేరింది.

## బాల్య వివాహాల నిర్మూలనకు అవగాహన ర్యాలీ



ఏర్పేడు, మార్చి 10, ప్రభాతవార్త; మండలంలోని బండారుపల్లి, వెంకటంపాళ్యం, చింతలపాళ్యం, పోతుమానుగుంట, పల్లం గ్రామాల్లో బాల్య వివాహాల నిర్మూలనపై ఆదివారం ప్రగతి సంస్థ సభ్యులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతి స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ శిరీష మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు జరుగు కళ్యాణోత్సవాన్ని పురస్కరించుకొని పరిసర గ్రామాల్లో వివాహాలు చేసుకోవడం అనవాయితి అయినా చాల మంది పేదలు వివాహాల ఖర్చులు తగ్గించుకోవాలనే ఉద్దేశ్యంతో బాల బాలికలకు కూడా వివాహాలు చేస్తున్నారు. చట్టరీత్యా బాల్య వివాహాలు నేరం విషయాన్ని గ్రహించకుండా బాల బాలికలకు వివాహాలు చేయడం వల్ల భవిష్యత్తులో జరిగే అనర్ధాలు గురించి ప్రతి తల్లితండ్రులు తెలుసుకోవాలన్నారు. అమ్మాయిలకు 18సంవత్సరములు, అబ్బాయిలకు 21సంవత్సరాలు పూర్తి కావాలన్నారు. ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## టిడిపి నాయకుడి మృతికి నివాళులర్పించిన రిషితా రెడ్డి



ఏర్పేడు, మార్చి 10, ప్రభాతవార్త; మండలంలోని పంగూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు నాగమల్లి నాగార్జున ఆదివారం అకస్మిక మృతి చెందారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి మృతుడి భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. మృతుడి కుటుంబానికి పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఆమె వెంట పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## కోలా ఆనంద్ కుమార్‌ని ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిపించండి

ఏర్పేడు, మార్చి10, ప్రభాతవార్త; శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యేగా బిజెపి పార్టీ తరపున ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని ఆదివారం కందాడ పంచాయతీలో బిజెపి కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరిగి బిజెపి ప్రభుత్వం తరపున ప్రధాని నరేంద్రమోడి పేద ప్రజలకు, రైతులకు, మహిళలకు ప్రవేశపెట్టిన పలు పథకాలకు సంబంధించిన కర పత్రాలను పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు ఈగల బాలాజి రాయల్, బాలగురవయ్య, గురసాల మణి యాదవ్, గూళూరు దామోదర్ రాయల్, బొక్కేసం కిరణ్‌మణి, మెరూం వినోద్, శ్రీనివాసులు యాదవ్, ప్రసాద్, భువన ప్రకాష్ యాదవ్ తదితరఉలు పాల్గొన్నారు.

## విద్యార్థులు విద్యపట్ల ఆసక్తి పెంచుకోవాలి - డీఎస్పీ



రేణిగుంట, మార్చి 10 ప్రభాతవార్త: విద్యార్థులు చదువుని ఇష్టపడి చదివినప్పుడు రాణించగలుగుతారని రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్ అన్నారు. రేణిగుంట పాత చెక్‌పోస్టు సమీపంలోని కల్యాణ మండపంలో ఆదివారం ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఏడో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. పాటలు, నృత్యం, కరాటే, సంగీతం తదితర పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సాయిసుధ ఆస్పత్రి అధినేత డా. సుకుమార్, విద్యాసంస్థల ప్రిన్సిపల్ గౌతమి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మొబైల్‌షాపు యజమానులచే అన్నదానం



శ్రీకాళహస్తి, మార్చి 10 ప్రభాతవార్త పట్టణంలోని వాయులింగేశ్వర మొబైల్‌షాప్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వామిఅమ్మవార్ల కళ్యాణోత్సవం సందర్భంగా పట్టణంలోని నగరివీధిలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు వెయ్యిమందికి అన్నదానం చేపట్టారు. తొలిసారిగా మొబైల్‌షాప్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించిరు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు కె.హెచ్.ప్రసాద్, అధ్యక్షులు ఎస్.షాహిర్, కార్యదర్శి సురేంద్ర యాదవ్, ట్రెజరర్ హుమయూన్‌ముబారక్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నగర మహిళా ప్రధాన కార్యదర్శిగా అనిత

తిరుపతి, మార్చి 10ప్రభాతవార్త:



ఎన్నికలు సమీపిస్తుండటంతో తిరుపతిలో టిడిపిని బలోపేతం చేసేందుకు నగర కమిటీనీ నియమించారు. ఇన్‌ఛార్జి సుగుణమ్మ ఈ మేరకు అనితను నగరపార్టీ మహిళ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ పత్రం అందజేశారు. శనివారం ఆత్మీయ సమావేశంలో అనితకు పదవిని కట్టబెట్టారు.

# తిరుపతి డివిజన్

## డీసీసీ బ్యాంకు సేవలు విస్తృతం చేయడానికే ఏటిఎం ప్రారంభం

: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి

- కృపాలక్ష్మిని, రెడ్డప్పల గెలుపుకు కృషి చేయండి



వెదురుకుప్పం, మార్చి 10 ప్రభాతవార్త : డీసీసీబి బ్యాంకు సేవలను విస్తృతం చేయడం కొరకే ఏటిఎం ప్రారంభించడం జరిగిందని, ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రా రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని చవటగుంటలోని సింగిల్‌విండో కార్యాలయం వద్ద ఏటియంను ఆదివారం, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రా రెడ్డి, డీసీసీబి ఛైర్మెన్ రెడ్డమ్మకృష్ణమూర్తి, గంగాధర నెల్లూరు నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్ధి కృపాలక్ష్మీ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగిల్‌విండో బ్యాంకు సేవలను రైతులకు, ఖాతదారులకు మరింత చేరువ చేయడం కొరకు ఏటిఎం ఏర్పాటు చేయడం జరిగిందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపడం జగన్మోహన్ రెడ్డికే సాధ్యమవుతుందని తిరిగి ఆదరించాలని కోరారు. నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్ధిగా కృపాలక్ష్మీ, పార్లమెంటు అభ్యర్ధిగా రెడ్డప్పను ఆధరించి భారీ మెజార్టీతో గెలిపించి, ఆశీర్వదిం చాలన్నారు. సింగిల్‌విండో ఛైర్మెన్ లోకనాధ రెడ్డి, మండల వైసీపీ అధ్యక్షులు కామసాని పద్మనాభ రెడ్డి, సర్పంచ్ శిల్పాశంకర్, ఎంపిటీసీ పుత్తూరు రాధిక పురంధర్ రెడ్డి, ఎంపీపీ నాగ రాణి హేమసుందర్ రెడ్డి, జడ్పీటిసి చలం పాళ్యం సుకుమార్, మండల గృహసారధుల కమిటీ కన్వీనర్ బట్టే సుబ్రమణ్యం, మాజీ జడ్పీటీసీ సభ్యులు బండి గోవర్ధన్ రెడ్డి, పుత్తూరు మాజీ మార్కెటింగ్ కమిటీ ఉపాధ్యక్షులు రామయ్య, తహశీల్ధార్ జయంత్ కుమార్, ఎంపిడివో పురుషోత్తం, సింగిల్‌విండో సిఇవో రమేష్, నాయకులు రోసు రెడ్డి, మాధవరావు, రాణెమ్మ, మునికృష్ణ రెడ్డి, గోవిందన్, ధనంజేయుల రెడ్డి పాల్గొన్నారు.

## తుమ్మలగుంట చెరువు అనవాళ్ళు గల్లంతు

-ఎమ్మెల్యే ఆహ్లాదం కోసం రూ.కోట్ల తుడ నిధులు దుర్వినియోగం

-రాష్ట్ర ఓబిసి ఫోరం కన్వీనర్ బడి సుధా యాదవ్



తిరుపతిరూరల్, మార్చి 10 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ తుమ్మలగుంట చెరువు అనవాళ్ళు కనబడుట లేదని, ఇది ప్రపంచంలోని 8వ వింత అని రాష్ట్ర ఓబిసి ఫోరం కన్వీనర్ బడి సుధా యాదవ్ ఆరోపించారు. బడి సుధా యాదవ్ తన అనుచరులతో కలిసి ఆదివారం చెరువు అనవాళ్ల కనబడని తుమ్మల గుంట చెరువును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తుమ్మలగుంటలో వున్న 100 ఎకరాల చెరువును ఎమ్మెల్యే చెవిరెడ్డి తన స్వంత ఎస్టేట్‌గా మార్చివేసారని ఆరోపించారు. కోట్లాది రుపాయాలు ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసారని, ఆయన ఆహ్లాదం కోసం సుందరీకరణకు కోట్లు రుపాయాలు ఖర్చు చేసారని తెలిపారు. తుమ్మలగుంట చెఱువు పరిరక్షణ కోసం గత 10 రోజులకు మునుపు ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్న విషయాన్ని తెలియజేసారు. రెండు రోజుల తర్వాత ఆర్డీఓ, ఎంపిడిఓ, తహశీల్ధార్ చెఱువును సర్వే చేయిస్తామని హామీ ఇవ్వడంతో అమరణ నిరాహార దీక్ష విరమించడం జరిగిందని తెలిపారు. అధికారులు సర్వేచేయించి, తుమ్మలగుంట చెరువును చెరువుగానే ఉంచాలని డిమాండ్ చేసారు.

## రూ.39.5 లక్షలతో వెదురుకుప్పం రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

వెదురుకుప్పం, మార్చి 10 ప్రభాతవార్త :



మండల కేంద్రం ఎంపిడివో కార్యాలయం నుంచి వెదురుకుప్పం వరకు మంజూరైన రోడ్డు నిర్మాణంకు డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రా రెడ్డి భూమి పూజ చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. దీర్ఘకాలంగా రోడ్డు సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సౌకర్యం కల్పించే లక్ష్యంతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టిన్నట్లు చెప్పా రు. పురోహితుల వేద మంత్రాల నడుమ శాస్త్రయుక్తంగా పూజలు నిర్వహించి రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. 39 లక్షల యాభైవేల రూపాయలతో పనులు జరుగుతాయన్నారు. ఈ వైసీపీ అభ్యర్ధి కృపాలక్ష్మీ, డీసీసీబి ఛైర్మెన్ రెడ్డమ్మ, స్ధానిక సర్పంచ్ శిల్పాశంకర్, ఎంపిటీసీ పుత్తూరు రాధికపురంధర్ రెడ్డి, జడ్పీటిసి చలం పాళ్యం సుకుమార్, మాజీ ఎంపీపీ జ్ఞానకొండా రెడ్డి, నాయకులు రామయ్య, సుబ్రమణ్యం, ఎంపిడివోపురుషోత్తం, పంచాయితీ కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి చేసి చూపుతా... ఆదరించి ఆశీర్వదించండి

- టీడీపీ అభ్యర్ధి డాక్టర్ వియం. థామస్

వెదురుకుప్పం, మార్చి 10 ప్రభాతవార్త :

నియోజకవర్గంలో అభివృద్ది జరిగింది శూన్యమని ఒక్క అవకాశం కల్పిస్తే అభివృద్ధి చేసి చూపుతానని తెలుగు దేశం, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్ధి డాక్టర్ వియం.థామస్ ప్రజలను అభ్యర్ధించారు. మండలంలోని బొమ్మయ్యపల్లె సచివాలయం పరిధిలోని దేవళంపేట రామాలయం నుంచి రామక్రిష్ణపురం వరకు ఉదయం భారీ స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రామకృష్ణపురం, గారంపల్లె, బొమ్మయ్యపల్లె, చిన్నబొమ్మయ్యపల్లె గ్రామాలలో మన ఇంటికి మన థామస్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు పంపిణీ చేసి. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లోకనాధ రెడ్డి, తిరుపతి నియోజకవర్గం పరిశీలకులు చిట్టిబాబు నాయుడు, మాజీ అధ్యక్షులు మురళి మోహన్, నియోజకవర్గం యువత అధ్యక్షులు గురసాల కిషన్ చంద్, నాయకులుభాస్కర్ నాయుడు, నరసింహయాదవ్, యతీశ్వర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళ సాధికారతతోనే దేశం అభివృద్ధి

- మహిళా దినోత్సవంలో డిఆర్‌డిఎ జిల్లా అధికారి శాంతిదుర్గ



తిరుపతిరూరల్, మార్చి 10 ప్రభాతవార్త: మహిళలు అన్ని రంగాలలో ముందుకు వెళ్ళుటకు మరింత ప్రోత్సహం అవసరమని, అది మహిళా సాధికారితతోనే సాధ్యమని డిఆర్‌డిఎ జిల్లా అధికారి శాంతిదుర్గ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మేక్ మై బేబీ స్కూల్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఉపాధ్యాయ సంఘం లీడర్ నిర్మల మాట్లాడుతూ, మహిళలకు ఉన్న హక్కులను సద్వినియోగపరుచుకుని మరింత ముందుకు తీసుకెళ్ళాలని తెలిపారు. నేడు అంతరిక్షంలోకి వెళుతున్న వారిలో మహిళల శాతమే అధికంగా ఉందన్నారు. డాక్టర్ చత్రప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ మహిళా ఉద్యోగులకు నెలలో కనీసం 5రోజులు సెలవులు మంజూరు చేయాలని, మహిళలకు మైండ్ పవర్ బలంగా ఉంటుందని తెలిపారు. అనంతరం మహిళా ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ ప్రసాద్‌రెడ్డి, జిల్లా మహిళా కార్యదర్శి నాగమణి, సిహెచ్‌ఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, జిల్లా అధ్యక్షులు తులసీరామ్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

## కేవీబీ పురం మండలంలో హెలెన్ ప్రచారం



కేవీబీ పురం, మార్చి 10 ప్రభాతవార్త: కేవీబీపురం మండలం మిద్దికండ్రిగ గ్రామ పంచాయతీలో సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డా. హెలెన్ మండల పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి, మండల క్లస్టర్ ఇన్‌చార్జి మునస్వామి యాదవ్ అధ్యక్షతన బాబు సూపర్‌సిక్స్ డోర్ టు డోర్ క్యాంపనింగ్ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ వస్తే రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందని ఆమె తెలిపారు. రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామియాదవ్, పార్లమెంట్ యువత అధికార ప్రతినిధి లోకేష్‌చౌదరి, మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి యాదవ్, కేవీబీ పురం మాజీ ఎంపీటీసీ మునికృష్ణయ్య, తిమ్మసముద్రం సర్పంచ్ దొరబాబునాయుడు, రాజుల కండ్రిగ సర్పంచ్ వెంకటేష్, ఓలూరు సర్పంచ్ సురేష్ చౌదరి, పాలేగార్ సంఘం అధ్యక్షులు వెంకట కృష్ణయ్య, పార్లమెంట్ రైతు కార్యదర్శి నాయుడు, బ్రాహ్మణపల్లి నాయకులు సురేష్‌నాయుడు, మండల ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి సుమన్, కోటమంగాపురం బూత్ ఇన్‌చార్జి గోపి, కోటమంగాపురం దినేష్, యువ నాయకులు వెట్టి హరి, మిద్దికండ్రిగ గ్రామ కమిటీ అధ్యక్షులు దొరస్వామి, బూత ఇన్‌చార్జి శ్రీనివాసులు, యువత ప్రధాన కార్యదర్శి హరియాదవ్, పురుషోత్తం యాదవ్, ప్రభాకర్, అయ్యప్ప, భాస్కర్, మిద్దికండ్రిగ గ్రామ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు.

## కేవీబీపురం ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఎండీ షరీఫ్

కేవీబీపురం, మార్చి 10 ప్రభాతవార్త:

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికారుల బదిలీలు జరుగుతున్న వేళ కేవీబీ పురం మండలం ఎస్ఐగా ఎస్ఎండీ షరీఫ్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎస్ఐ సునీల్ బదిలీపై వీఆర్‌కు వెళ్ళడంతో వీఆర్‌లో ఉన్న ఎస్ఐ ఎస్ఎండీ షరీఫ్ కేవీబీ పురం ఎస్ఐగా బాధ్యతలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రత పరిరక్షణకు కృషిచేస్తానని అన్నారు.

## నగరి పట్టణంలో పోలీసు కవాత్

నగరి, మార్చి 10 ప్రభాతవార్త: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గ కేంద్రం నగరిలో ఆదివారం పోలీసు కవాత్ నిర్వహించారు. పట్టణంలోని ఓంశక్తి ఆలయ సర్కిల్ నుంచి బస్టాండ్ వరకు అనంతరం పల్లిపట్టు రోడ్డు, నాగలాపురం రోడ్డులో కవాతు నిర్వహించారు. కవాతు ముగింపులో బస్టాండ్ ప్రాంగణంలో డీఎస్పీ నరసింహ మూర్తి మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా ఎన్నికలు జరిగేలా ప్రజల సహకరించాలన్నారు. రెండు, మూడు రోజుల్లో ఎన్నికల కోడ్ వస్తున్నందున ఎన్నికల నియమావళి పట్ల పౌరులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయరాదన్నారు. ఎన్నికల నిమిత్తం నేపాల్ బార్డర్ నుంచి వంద మంది మిలిటరీ ఫోర్స్ తెప్పించామన్నారు. ఈ కవాత్‌లో అసిస్టెంట్ కమాండెంట్ బీనిత్, ఎస్ఎస్‌బీ సీఐ వర్మ, సీఐ సురేష్, ఎస్ఐ వెంకట నారాయణ పాల్గొన్నారు.

# కైలాసనాధునికి పట్టువస్త్రాలు -అమ్మవారికి టిటిడి సారె



స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు తీసుకువెళ్తున్న తితిదే ఇఓ

(శ్రీకాళహస్తి ప్రభాతవార్త)

శ్రీకాళహస్తిలోని వాయులింగేశ్వరుని సన్నిధిలో జరుగుతున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలల్లో భాగంగా సోమవారం వేకువ జామున జరిగే స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవానికి ఆదివారం సాయంత్రం టిటిడి తరఫున స్వామి వారికి పట్టు వస్త్రాలు అమ్మవారికి సారెను టిటిడి ఇఓ ధర్మారెడ్డి అందించారు. ఈ ఉత్సవానికి విశేష స్పందన వచ్చింది. ఇఓ ధర్మారెడ్డి, డెప్యూటీ ఇఓ లోకనాథం, టిటిడి వేదపండితులు వెంటరాగా సారెను తెచ్చారు. పట్టణంలోని తేరువీధిలో గల దేవాంగుల మండపం వద్ద నుంచి బిక్షాల గాలిగోపురం, బాలజ్ఞానాంబిక గోపురం నుంచి ఉత్సవంగా కేరళ పంచవాయిదా ్యలు గెరిగె ఉత్సవం సాంప్రదాయ మేళతాళాలు, మంగళవాయిద్యాలతో పట్టు వస్త్రాల్ని తెచ్చారు. ఆలయంలోని ఆకాశ వినాయకుడు, చెంగల్వరాయ ఆలయంలో పూజలు జరిపి అలంకార మండపంలోకి తెచ్చారు. అక్కడ ఆలయప్రధానార్చకులు డాక్టర్ స్వామినాధన్ గురుకుల్ టిటిడి సారెను వరుడు కైలాసనాధుడు, వధువుగా ముస్తాబౌతున్న జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి అలంకరింపజేసి హారతులిచ్చారు. రుద్రాక్షల పల్లకిలో ముస్తాబౌతున్న వధూ వరులకు టిటిడి పట్టు వస్త్రాలు కొత్త అందానిచ్చాయా? అనే విధంగా కన్నులు మిరుమిట్లు గొల్పాయి. వారికి ఆలయ దర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఇఓ వియస్ నాగేశ్వరరావు ఘనస్వాగతం పలికారు. అలంకార మండపం నుంచి పట్టు వస్త్రాల్ని శాస్త్రోక్తంగా ఊరేగింపుగా బిక్షాల గాలిగోపురం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్ళారు. ఉత్సవానికి పట్టణానికి చెందిన భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. 1998 నుంచి ఈ సంప్రదాయం అమలు జరుగుతుంది. స్వాగతం పలికిన వారిలో శాసనసభ్యుని తనయుడు బియ్యపు ఆకర్షరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వరసిద్ధి వినాయక స్వామిచే పట్టు వస్త్రాలు



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో గత కొన్ని సంవత్సరాలుగా దేవాదాయశాఖ ఆలయాల్ని సమన్వయం చేస్తూ బ్రహ్మోత్సవాల్లో పట్టువస్త్రాల్ని అందించే కొత్త సంప్రదాయం అమలు జరుగుతుంది. ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వేకువ జామున స్వామి అమ్మవార్ల కళ్యాణం జరగనుంది. ఈ నేపధ్యంలో ఆదివారం కాణిపాక వరసిద్ది వినాయకస్వామి దేవస్థానం ఇక్కడి స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించటానికి వచ్చారు. ధర్మకర్తల మండలి చైర్మెన్ మోహన్‌రెడ్డి దంపతులు ఇఓ వెంకటేష్‌ల సారధ్యంలో పట్టు వస్త్రాలను తీసుకొచ్చారు. వారికి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆలయ కార్యనిర్వహణాధికారి వి.యస్ నాగేశ్వరరావు, ఉప కార్యనిర్వహణాధికారి ఏకాంబరం, సహాయ కమిషనర్ మల్లికార్జున్ ప్రసాద్, ఎఇఒ ధనపాల్, సతీష్‌మాలిక్, ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సభ్యులు ప్రత్యేకాహ్వానితులు స్వాగతం పలికారు. పట్టు వస్త్రాలను జ్ఞాన ప్రసూనాంబ సదన్ నుంచి దక్షిణ గోపురం కంచుగడప నుంచి అలంకార మండపంలో అందించారు.

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో నేడు

9వ రోజు 11.03.2024 ఆనందరాత్రి
రుద్రాక్ష అంబారి వాహనసేవ
ఫాల్గుణ శుద్ధ పాడ్యమి సోమవారం ఉదయం 11గం.లకు
రాత్రిః-7గం.లకు శ్రీ సభాపతి కళ్యాణం
ఉభయదాతలు తిరువణ్ణామలై గ్రామం, అరుణాచలం
(శాశ్వత ఉభయము 2027వ సంవత్సరం వరకు)

**-ధూర్జటి కళాప్రాంగణంలో నేడు-**

11.03.2024 సోమవారం
సభాపతి కళ్యాణం
మ.3గం.నుంచి- కోదండపాణి, వెదళ్ళ చెరువు వారిచే భక్తిరంజని
సా.4గం.నుంచి- నేరేళ్ళ వరలక్ష్మి కళ్యాణి, తెనాలి వారిచే భక్తిరంజని
సా.5గం.నుంచి-రూపకూచిపూడి డ్యాన్స్ అకాడమీ, విశాఖపట్నం, శ్రీరూప వారిచే నృత్య ప్రదర్శన
సా.6గం.నుంచి- శ్రీవల్లీ, సుదీప్త వారిచే ఒడిశా, మణిపురి బృంద నృత్య ప్రదర్శన
రా.8గం.నుంచి- టి.గాయత్రి బృందం చెన్నై వారిచే ఆన్ స్టాపబుల్ ఫ్యూజన్ కార్యక్రమం
రా.9.30గం.నుంచి- శ్రీ నటరాజ నృత్యాలయం, మంగళగిరి బి.తిరుమల కళ్యాణి బృందంచే నృత్యప్రదర్శన
రా.10.30గం.నుంచి- శ్రీ కళా నాట్యమండలి, శ్రీకాళహస్తి, యస్. శ్రీవిద్యబృందంచే నృత్యప్రదర్శన
రా.11.30గం.నుంచి-నృత్యాంజలి స్కూల్ ఆఫ్ ఆర్ట్స్, చెన్నై వారిచే నృత్య ప్రదర్శన
రా.12.30గం.నుంచి- శ్రీశ్రీ అంకమ్మ నాట్యమండలి, పి.పెంచలయ్య, పెద్దకనపర్తి వారిచే 'చౌచౌ' నాటక ప్రదర్శన
రా.2గం.నుంచి- శ్రీ జగన్మాత నాట్యమండలి, యం.వెంకటయ్య, కొత్తకండ్రిగ వారిచే 'సత్యహరిశ్చంద్ర' నాటక ప్రదర్శన

## దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం తరపున పట్టు వస్త్రాలు



శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం విజయవాడ దుర్గామల్లేశ్వరాలయం తరఫున ఇఓ పట్టువస్త్రాలను అందించారు. గతంలో ఇక్కడి ఇఓగా పని చేసిన కె.యస్.రామారావు సారధ్యంలో పట్టువస్త్రాలను తెచ్చారు. దక్షిణ గోపురం నుంచి పట్టువస్త్రాలను దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఆలయ ఇఓ కె.యస్.రామారావు స్థానిక సంప్రదాయంమేరకు పట్టువస్త్రాలను ఊరేగింపుగా తెచ్చి అలంకార మండపంలో ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాధన్‌కు అందించారు. వారికి ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆలయ కార్యనిర్వహణాధికారి నాగేశ్వరరావు, ఉప కార్యనిర్వహణాధికారి ఏకాంబరం సహాయ కమిషనర్ మల్లికార్జున్ ప్రసాద్, ఎఇఒలు ధనపాల్, లోకేష్‌రెడ్డి సతీష్‌మాలిక్, ధర్మకర్తల మండలి సభ్యులు ప్రత్యేకాహ్వానితులు స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో బోర్డుసభ్యులు కొండూరుసునీత, పసలసుమతి, నీల, జూలుగంటి సుబ్బారావులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి ఉత్సవాల్లో ఉభయదారులకు పెద్దపీట



శ్రీకాళహస్తి-ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఈ ఏడాది ఉభయదారులకు దేవస్థానం పెద్దపీట వేసారు. ఆది నుంచి ఉత్సవాలను నిర్వహించటంలో కీలకమైన ఉభయదారులకు ప్రస్తుత శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆలయాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారి చేసారు. ముఖ్యంగా ఆలయానికి ధూప దీప నైవేద్యాలు లేని రోజుల్లో ఆదరించిన ఉభయదారులకు ప్రస్తుతం ఉత్సవాల్లో వారికి అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ఈ నేపధ్యంలో ఆది నుంచి ఉభయదారులకు పెద్దపీట వేసారు. మొదటి రోజు రాత్రి ఉత్సవం గ్రామోత్సవం నిర్వహించ లేకపోయినా ఆలయంలోనే ఉత్సవం నిర్వహించగా బయ్యానాగమ్మ కుటుంబసభ్యులను పాల్గొనేటట్లు చేసారు. అలాగే ప్రతి రోజూ ఉత్సవాల్లో ముందు ఉభయదారులకు అవకాశం కల్పిస్తున్నారు. అలాగే వారికి ఆలయంలో స్వామి అమ్మవార్ల దర్శనానికి ప్రత్యేకంగా అవకాశం కల్పించారు. దాంతో ఉభయదారుల్లో ఎంతో సంతోషం వేసింది.

## సంప్రదాయానికి పెద్దపీట

# స్వామి అమ్మవార్ల కళ్యాణం-ప్రధానోత్సవం



(శ్రీకాళహస్తి, ప్రభాతవార్త)

హిందూ సంప్రదాయంలో కళ్యాణోత్సవాల్లో ' ప్రధాన భూమిక ప్రధానోత్సవం'. ఈ సంప్రదాయాన్ని భావి తరాలకు అందించుటకు శ్రీకాళహస్తీశ్వరా లయంలో జరిగే స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం ఓ సూచికగా సాగుతుంది. సోమవారం వేకువ జామున జరిగే స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం వరుడు, వదువులకు సంబంధించిన ఉభయదారులు భారీ ఎత్తున ప్రధానోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మందికి సహాపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని శెంగుందర్ కుల వెళ్ళత్తూరు మరబినర్ సంఘం, చెంబేడుకు చెందిన కైకాల వారి సంఘం అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంప్రదాయ బద్ధంగా కొత్తగా నెహ్రూవీధిలో శెంగుందర్‌కుల మరభినర్ నిర్వహించారు. కళ్యాణోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా స్థానిక ఆచారం మేరకు నిర్వహించుటకు తమతో సంప్రదించాలని ఇఓ నిర్వాహకుల్ని కోరారు.

## శివయ్యకు మల్లన్న పట్టు వస్త్రాలు



(ప్రభాతవార్త-శ్రీకాళహస్తి)

దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో జరుగు తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో దేవాదాయశాఖ కొత్త సంప్రదాయాలను ప్రవేశ పెట్టారు. ఈ నేపధ్యంలో రాష్ట్రం లోని ప్రధాన దేవాలయాల్లో జరిగే ఉత్స వాల్లో ఒక ఆలయం మరో ఆలయానికి సంప్రదాయ బద్ధంగా పట్టు వస్త్రాలను అందిస్తున్నారు. ఈ నేపధ్యంలో ఆదివారం శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయం నుంచి ఎఇఓ మోహన్ సారధ్యంలో పట్టు వస్త్రాలను అందించారు. వారికి ఆలయ ఇఓ నాగేశ్వరరావు స్వాగతం పలికారు. సంప్రదాయ బద్ధంగా పట్టు వస్త్రాలను స్వామి అమ్మవార్ల అలంకార మండపంలో అర్చకులు స్వామి అమ్మవార్లకు అలలకరించారు. తరువాత ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాలయం దర్శనం

## నేడు ఉదయం 9గంటల తరువాత పూజలు

శ్రీకాళహస్తి-ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహిమాన్వితంగా నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలను సోమవారం ఉదయం 9గంటల తరువాత జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి వి.యస్.నాగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం సందర్భంగా ఉత్సవమూర్తులు బయటకు వెళ్ళటంతో సోమవారం వేకువ జామున పెండ్లి మండపం వద్ద ఉండటంతో ఆలయంలోపల పూజలు అభిషేకాలు ఉండవని స్వామి అమ్మవార్లు ఆలయంలోనికి వచ్చిన తరువాత రాహుకేతుదోష నివారణ పూజలు నిర్వహిస్తామని వివరించారు.

## శివరాత్రి సంబరాల్లో ఘనంగా పార్వేట ఉత్సవం



తడ, మార్చి 10 ప్రభాతవార్త

తడ మండలం చినమాంబట్టులోని గంగా అన్నపూర్ణేశ్వరి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మహాశివరాత్రి వేడుకలు మూడవ రోజు నిర్వహించారు. మాంబట్టుకు దగ్గరలోని ఎన్ఎం కండ్రిగలో పార్వేట మహోత్సవం సాంప్రదాయబద్ధంగా జరిపారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. బోడిలింగాలపాడు, పాడిమిట్టలలో వసంతోత్సవం జరిపారు. కొన్ని ఆలయాలలో ఆదివారం భక్తుల రద్దీ ఎక్కువైంది. సమీపంలోని పరిశ్రమలకు సెలవు కావడంతో శివాలయాలు కిటకిటలాడాయి. మండలంలోని వాటంబేడులో వెలసిన ప్రసన్న విశాలాక్షి కాశీవిశ్వేశ్వర ఆలయంలో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు.

## హంస వాహనంపై తొండమాన్ స్వామి

శ్రీకాళహస్తిరూరల్, మార్చి 10 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో బాగంగా ఆదివారం స్వామి అమ్మవార్లు హంసవాహనంపై ప్రతిష్టించి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో స్వామి అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించారు. ఆదివారం కావటంతో ఉదయం నుంచి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఉత్సవాన్ని డెప్యూటీ ఇఓ దేవేంద్రబాబు, టెంపుల్ ఇన్సెపెక్టర్ రవి, అర్చకులు రమణస్వామి, కృష్ణస్వామి, గోపి స్వామి, జయస్వామిలు వెంటరాగా గ్రామానికి చెందిన కందాటిశేఖర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, జయచంద్రారెడ్డి తదితరులు రాగా గ్రామోత్సవం నిర్వహించారు.

## కన్నులపండువగా స్వామిఅమ్మవార్ల కళ్యాణోత్సవం



తొట్టంబేడు, మార్చి 10 ప్రభాతవార్త

మహాశివరాత్రి బ్రహ్మత్సవాల్లో భాగంగా మండలంలోని పెద్దకన్నలి గ్రామంలో వెలసిన దుర్గాదేవి సమేత అగస్తీశ్వరాలయంలో ఆదివారం రాత్రి స్వామిఅమ్మవార్ల కళ్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి కళ్యాణవేదికపైకి తీసుకువచ్చారు. ఆలయ అర్చకులు ప్రసాద్‌స్వామి, కృష్ణస్వామి, మనోహర్‌శర్మ, రాజశేఖర్‌శర్మల ఆధ్వర్యంలో వేదమంత్రాలు పఠిస్తుండగా కళ్యాణోత్సవం ఆద్యంతం కమనీయంగా సాగింది. కళ్యాణోత్సవానికి పలువురు గ్రామస్తులు హాజరవడంతో కళ్యాణవేదిక కళకళలాడింది. వేదపండితులు వేదమంత్రోచ్చారణల మద్య నిర్వహించిన కళ్యాణోత్సం భక్తిపారశవ్యాన్ని నింపింది. అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహిం చారు. ఆలయంలో స్వామిఅమ్మవార్లను దర్శించుకున్న అనంతరం తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నదానం నిర్వహించారు.

## బోయకొండపై తరగని భక్తుల రద్దీ

బోయకొండ(చౌడేపల్లి), మార్చి 10 ప్రభాతవార్త



శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. ఆదివారం కొండ దినం కావడంతో రాష్ట్రం నుంచి కాకుండా కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాల వారు తరలిరావడంతో అమ్మ వారి ఆలయం భక్తజన సంద్రమైంది. ఉదయాన్నే వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకం అలంకరణ గావించారు. ఛేర్మన్ నాగరాజరెడ్డి, ఇఓ చంద్రమౌళి, ఆలయ అర్చక, అధికార, సిబ్బంది భక్తులకు సేవలందించారు.

## విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత




తిరుపతి హెల్త్, మార్చి 10, ప్రభాతవార్త

తిరుచానూరులోని సంస్కృతి జూనియర్ కాలేజీలో ఆప్తా (అమెరికన్ ప్రోగెస్సివ్ తెలుగు అసోసియేషన్) ద్వారా తిరుపతి జిల్లాలోని పేద బలిజ విద్యార్థులకు (35 మందికి) స్కాలర్‌షిప్ ద్వారా సుమారు 5.60 లక్షల విలువైన చెక్‌లను అందజేశారు. ఈ కార్యక్రమానికి మహిళా యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ భారతి, శ్రీపద్మావతి మహిళా డిగ్రీ, పిజి కాలేజీ ప్రిన్సిపాల్ డా. నారాయణమ్మ, ఎస్వీ అగ్రికల్చరల్ యూనివర్శిటీ మాజీ డీన్ హరిబాబు, బిసినెస్ మెన్ కొట్టే రాజగోపాల్, పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ సులోచనమ్మ, బోత్ హాస్పిటల్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, రుసా ఛైర్‌పర్సన్ వంశీ ముఖ్యఅతిథులుగా పాల్గొని విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశ్శారు. ఈ కార్యక్రమాన్ని డా. మురళి కొణిదిన, శ్రీనివాసులు అరిగెల, మెండ్రి చిరంజీవి, తోట మధు, రెడ్డిబాబు, కిరన్, సుమన్ వీరిశెట్టిల ఆధ్వర్యంలో నిర్వహించారు.

## నగరి నియోజకవర్గ అభివృద్ధే నా ఆకాంక్ష - అశోకరాజు

విజయపురం, మార్చి 10 ప్రభాతవార్త:



నగరి నియోజకవర్గ అభివృద్ధే నా ఆకాంక్ష అని సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ అధినేత, టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి అశోకరాజు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రమైన విజయపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1983లో టీడీపీలో చేరి కర్షక పరిషత్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నానని, 40 సంవత్సరాల పాటు పార్టీకి సేవలు చేసినా గుర్తింపు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2002 నుంచి ఎమ్మెల్యే రేసులో ఉన్నా చివరి క్షణంలో అభ్యర్థులను మార్చడం ఆనవాయితీగా మారిపోయిందని వాపోయారు. 2002 నుంచి 151మెడికల్ క్యాంపులు నిర్వహించి 57 వేల మందికి వైద్య చికిత్సలు అందించాను. గర్భిణీలకు ఉపయుక్తంగా 2003 నుంచి ఫ్రీ అంబులెన్స్ సర్వీసు కూడా ఏర్పాటు చేశామని, డెంటల్ మెడికల్ క్యాంపు నిర్వహించి 6 వేల మందికి చికిత్స అందించామన్నారు. నగరిలో తాగునీటి ఎద్దడి నివారణకు 2003 నుంచి ట్యాంకరు ద్వారా సరఫరా చేశామన్నారు. 2004-09 సంవత్సంలో తాగునీటి నివారణకు స్వచ్ఛందంగా 65 బోర్లు వేస్తే 25 బోర్లు సఫలీకృతం అయిందన్నారు. 2018లో అప్పటిసీఎం చంద్రబాబు మహిళల కోసం ప్రవేశపెట్టిన పసుపు-కుంకుమలో భాగంగా 74 వేల కుటుంబాలకు శారీ పసుపు, కుంకుమ అందించామన్నారు. ఇంజనీరింగ్ కాలేజీలో రైతుల బిడ్డలకు, పేదలకు ఫీజు రాయితీ ఇస్తున్నామని తెలిపారు. 2007లో స్థానిక సంస్థ ఎన్నికల్లో నియోజకవర్గం మొత్తం సమన్వయంతో జరిపించామన్నారు. 2009లో ఎమ్మెల్యే సీటు కేటాయిస్తామని చెప్పి చివరి క్షణంలో స్వర్గీయ ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమనాయుడుకి ఇచ్చారని, 2014లో తిరుపతిలో ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తామని చెప్పి మోసం చేశారని వాపోయారు. ఎమ్మెల్యే టికెట్ ఆశించిన ప్రతిసారి టీడీపీ అధిష్టానం ఏదో ఒకటి చెప్పి కాలయాపన చేస్తూ సంఘ విద్రోహ శక్తులకు టికెట్ కేటాయిస్తున్నారని, సొంత కుటుంబంలోనే సపోర్టు లేని వ్యక్తికి మద్దతు ఇవ్వడం ఇష్టం లేక పార్టీ నుంచి దూరం కావలసి వచ్చిందన్నారు.

## ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు - డీఆర్ఎం

రేణిగుంట, మార్చి 10 ప్రభాతవార్త:



రైల్లో ప్రయాణించే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే రైల్వేశాఖ ప్రధాన ఉద్దేశమని డీఆర్ఎం వినీత్‌సింగ్ అన్నారు. రేణిగుంట రైల్వేస్టేషన్‌లో డీఆర్ఎం ఆదివారం తనిఖీలు నిర్వహించారు. రైల్వేస్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫాములను, క్రులాబి, వివిధ కార్యాలయాలను సందర్శించారు. అన్నిశాఖల అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే రైల్వేశాఖ ముఖ్య ఉద్దేశమన్నారు. రైల్వేశాఖ ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నదన్నారు. అనేక రైల్వేస్టేషన్లు, రైల్వే లైన్ల డబ్బింగ్ పనులు, ప్రాజెక్టులు, ప్రత్యేకించి కొత్త రైళ్లు, ఈ నెల 12న భారత ప్రధాని మోదీ ప్రారంభోత్సవంతో జాతికి అంకితం చేస్తారన్నారు. ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణంతో పాటు మెరుగైన సేవలు అందించగలడం సంతోషంగా ఉందన్నారు. సంవత్సరం రైల్వేశాఖ ఆంధ్రప్రదేశ్‌కు రికార్డు స్థాయిలో 9,138 కోట్లు కేటాయించిందని తెలియజేయడం ఆనందం అన్నారు. రైల్వేస్టేషన్ల ఆధునికరణ త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఆధునికరణ పూర్తయిన వెంటనే రైళ్లు ఆలస్యం లేకుండా నడుస్తాయన్నారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ పట్ల ప్రయాణికులు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైళ్ళ సంఖ్య పెంచడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఔటర్‌లలో రైళ్లు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రేణిగుంట రైల్వేస్టేషన్ గూడ్స్ రోడ్లో గూడ్స్ భోగీలు పట్టాలు తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీనియర్ డీవోఎం శ్రవణ్‌కుమార్, సీనియర్ డీసీఎం మనోజ్, తిరుపతి స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ, రేణిగుంట ఎస్.ఎస్.శేషగిరినాథ్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దళిత ద్రోహి డిప్యూటీ సీఎం నారాయణస్వామి

**: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్**

వెదురుకుప్పం, మార్చి 10 ప్రభాతవార్త :

దళితుడనే పేరుతో ఉన్నత పదవులు అనుభవించడం తప్ప దళితులకు, నియోజకవర్గం అభివృద్ధికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి చేసింది ఏమి లేదని టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ థామస్ తీవ్రంగా విమర్శించారు. ఆదివారం మన ఇంటింటికి మన థామస్ కార్యక్రమంలో భాగంగా బొమ్మయ్యపల్లెలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడి నియోజకవర్గంలో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి సుమారు ఐదు సంవత్సరాలు డిప్యూటీ సీఎంగా పనిచేసి తన వ్యక్తి అభివృద్ధికి బాటలు వేసుకున్నడు తప్ప నియోజకవర్గంకుగాని, యువతకు ప్రయోజనం చేసింది లేదని విమర్శించారు.

## ఈసారి నగరిలో టిడిపి గెలిస్తే...

# ఎప్పటికీ టిడిపినే గెలుస్తుంది

## గాలి భానుప్రకాశ్



పుత్తూరు, మార్చి 10 ప్రభాతవార్త : వచ్చే ఎన్నికల్లో నగరిలో తెలుగుదేశం పార్టీ గెలిస్తే ఎప్పటికీ నగరిలో టిడిపి జెండానే ఎగురుతుందని ఆ పార్టీ నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాశ్ స్పష్టం చేశారు. ఆదివారం పట్టణంలో చిత్తూరు-పుత్తూరు రోడ్డులో పార్టీ కార్యాలయాన్ని పార్టీ జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ తన తండ్రి దివంగత నేత ముద్దుకృష్ణమ నాయుడు అడుగుజాడల్లో ప్రజా సేవ చేస్తానన్నారు. ఆయనిచ్చిన స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడతానని తెలిపారు. మట్టి, గ్రావెల్ అక్రమ రవాణా ప్రోత్సహించమని, భూకబ్జాల అసలే జరగవని తెలిపారు. గంజాయిని నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో అరికడతామన్నారు. ఎన్నికలను ఒక యజ్ఞంగా భావించినపుడే మనం విజయం సాధించగమన్నారు. ప్రతి బూత్ పరిధిలో కూడా మెజార్టీ సాధించేందుకు క్యాడర్ ప్రయత్నించాలని, ఒక్క బూత్‌ను కూడా వదిలిపెట్టకూడదని తెలిపారు. కార్యకర్తలు ఇచ్చిన బలం వల్లే తొలి జాబితాలోనే తన పేరును అధిష్టానం ప్రకటించిందని తెలిపారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని తెలిపారు. అనంతరం ఆరేటమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడ నుంచి పట్టణంలో అంబేద్కర్ సర్కిల్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. నెత్తం గ్రామం నుంచి, పట్టణంలో కెహెచ్‌ఆర్ సంస్థ యజమాని కోలా సుధాకర్ నేతృత్వంలో పెద్ద సంఖ్యలో యువత భానుప్రకాశ్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. కార్యక్రమంలో టిడిపి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, అధికార ప్రతినిధి ఎన్.చినబాబు, బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.షణ్ముగరెడ్డి, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు రావిళ్ల మాధవనాయుడు, పట్టణ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాలి జీవరత్నంనాయుడు, ఎన్.ఎన్.ధనపాల్, రూరల్ పార్టీ అధ్యక్షుడు డి.రవికుమార్, మునిసిపల్ మాజీ ఛైర్మన్లు కరుణాకరన్, యుగంధర్, మాజీ వైస్‌ఛైర్మన్లు డి.ఎస్.గణేష్, ఆనంగి ఆనంద్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గజ వాహనంపై విహరించిన ఆది శంకరుడు



బంగారుపాళ్యం, మార్చి 10 ప్రభాతవార్త: మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం గజ వాహనంపై మొగిలీశ్వరుడు భక్తులకు దర్శనమిచ్చాడు. అంతకు ముందు స్వామి, అమ్మవార్లకు ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. వివిధ పుష్పాలతో అలంకరించిన గజ వాహనంపై స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులు వుంచి మంగళ వాయిద్యాలతో ఊరేగింపు చేపట్టారు. ఈ ఉత్సవానికి మొగిలి వారిపల్లికి చెందిన వసంతమ్మ, సుబ్రమణ్యం, నందా, గాంధీలు ఉభయదారులుగా వ్యహరించారు. ఇందులో ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త ఎంబి విజయకుమార్, ఇఓ మునిరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే శనివారం రాత్రి శేష వాహనంపై మొగిలీశ్వరుడు విహరిస్తూ భక్తులకు దర్శనభాగ్య కల్పించాడు. ఈ ఉత్సవానికి కొండేటివాండ్లవూరుకు చెందిన సుమతి, రంగనాధనాయుడులు ఉభయదారులుగా వ్యవహరించారు.

## శ్రీవారి సేవలో ప్రముఖులు





తిరుమల, మార్చి 10ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామిని ఆదివారం ఉదయం క్రికెటర్ నవదీప్‌సైని, మాజీ సిఎస్ ఎల్‌వి సుబ్రమణ్యం కుటుంబంతో దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఘనంగా స్మశాన కొళ్లై పూజలు



కుప్పంరూరల్, మార్చి 10 ప్రభాతవార్త

కుప్పం పట్టణంలో స్మశాన కొళ్లై పూజలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ అంగాళపరమేశ్వరి అమ్మవారి ఉత్సవాన్ని కొత్తపేటనుంచి స్థానిక స్మశాన వాటిక వరకు మేళతాళాలు, డప్పుల హోరుమధ్య ఊరేగించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా స్మశాన వాటికలో ఏర్పాటుచేసిన స్మశాన కొళ్లై పూజలకు జనం భారీ ఎత్తున హాజరయ్యారు. స్మశానంలో ఏర్పాటుచేసిన అమ్మవారి విగ్రహ ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దక్ష సంహరణ కార్యక్రమం జరిగింది. కాగా ఈ ప్రతిమ మట్టిని తీసుకునేందుకు జనం పోటెత్తారు. కాగా స్మశాన కొళ్లై సందర్భంగా మహిళా భక్తులు ఎముకలు కరకర కొరికి ఒళ్ళు గగుర్పాటు కలిగించారు. ఈ సందర్భంగా దెయ్యాలు, భూతాలు పట్టినవారికి వాటిని వదిలించే కార్యక్రమం చేపట్టారు. పలువురు భక్తులకు అమ్మవారి పూనకం రావడం జరిగింది. ఈ స్మశాన కొళ్లై పూజలను తిలకించేందుకు కుప్పం పరిసర ప్రాంతాలనుంచే కాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలనుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.